

కదంతొక్కిన కార్మికులు





ధాన్యలక్ష్మి.. వచ్చేసింది!

అన్నదాతలకు తీపి కబురు

- ధాన్యం బకాయిలన్నీ విడుదల
- మొత్తం రూ.362 కోట్లుపైనే
- 24 గంటల్లో చెల్లించేలా నిర్ణయం
- నేడు,రేపు జమకానున్న డబ్బులు
- కోనసీమకు రూ.189 కోట్లు
- తూర్పునకు రూ. 93.74 కోట్లు
- కాకినాడకు రూ.80 కోట్లు
- బాకీల విడుదలతో హర్షం

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రైతులకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. దాదాపు రెండు నెలలుగా పేరుకుపోయిన ధాన్యం బాకీ లకు మోక్షం కల్పించింది.ఈ మేరకు 24 గంట ల్లోగా వీటిని చెల్లించాలని బుధవారం జరిగిన కేబినెట్ సమావేశంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దీంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పేరుకు పోయిన రూ.362.72 కోట్ల బాకీలు రైతుల ఖాతాల్లో జమ కానున్నాయి. ప్రస్తుతం ఖరీఫ్ పనులు ఆసన్నమైన తరుణంలో బాకీలు పంట పెట్టుబడికి ఉపయోగపడనున్నాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రూ.362.74 కోట్లు చెల్లింపు

ఉమ్మడి జిల్లాలో ధాన్యం బాకీలు పేరుకుపోవడంతో అన్నదాతలు కొన్ని రోజులుగా డబ్బులకు ఎదురుచూస్తున్నారు.మిగిలిన బాకీలు చెల్లిస్తే ఖరీఫ్ సాగుకు డబ్బులు పనికొస్తాయని ఆశించారు. ఈ బాకీలకు సంబంధించి పౌరసరఫరాల సంస్థకు కేంద్రం నుంచి నిధులు రావడం ఆలస్యమైంది. దీంతో రైతులు పలు చోట్ల ఆందోళనలు చేసిన విషయం ప్రభుత్వం దృష్టికి వెళ్లింది. అన్నదాతలు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో సీఎం చంద్ర బాబు పౌర సరఫరాల సంస్థతో ఇటీవల సమీక్షించారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.800 కోట్ల వరకు బాకీలు ఉన్నాయని అధికారులు వివరించారు. బుధవారం జరిగిన కేబినెట్ సమావేశంలో ధాన్యం బకాయిలపై చర్చ జరిగింది. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా అన్నదాతలకు తక్షణం రూ.672 కోట్లు తక్షణం చెల్లింపులు చేయాలని సీఎం ఆదేశించారు.గురు, శుక్రవారాల్లో రైతుల ఖాతాల్లో జమకానున్నాయి. తూర్పుగోదావరి జిల్లాలో రూ.93.74 కోట్లు, కాకినాడ జిల్లాలో రూ.80 కోట్లు,కోనసీమ జిల్లా లో రూ.189 కోట్ల వరకు బాకీల చెల్లింపులు జరగనున్నాయి.మొత్తం 362.74 కోట్లు చెల్లిస్తారు.తద్వారా రైతులకు ధాన్యం బాకీల బెంగ తీరనుంది. రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

ఇప్పటికే రూ.1327 కోట్లు చెల్లింపు

ఈ ఏడాది రబీ సీజన్‌లో ఏప్రిల్ నుంచి మే నెలాఖరు వరకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసింది. ఎక్కడికక్కడ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి అన్నదాతల నుంచి ధాన్యం సేకరించింది. ఈ మేరకు అన్నదాతలకు ఇప్పటి వరకు రూ.1,327 కోట్లు చెల్లింపులు చేసింది. గత వైసీపీ ప్రభుత్వంలో అన్నదాతలు నరకం చూసేవారు.కానీ ప్రభుత్వం మారాక రబీ సీజ న్‌లో రైతులు పండించిన ధాన్యం దాదాపు కొనుగోలు చేయడానికి నిర్ణయించింది. తేమ శాతం దగ్గర నుంచి కొనుగోలు వరకు ఎక్కడా రైతులకు ఇబ్బందులు లేకుండా వ్యవహరించింది. మే నెల వరకు సుమారుగా 7.05 లక్షల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం కొనుగోలు చేసింది. కాకినాడ జిల్లాలో 15,667 మంది అన్నదాతల నుంచి 1.42 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఇందుకు రూ.322 కోట్ల వరకు బిల్లులు చెల్లించాల్సి ఉంది. వీటిలో ఇప్పటికే 1,167 మంది రైతులకు రూ.242 కోట్లు జమ చేసే సింది. తూర్పుగోదావరి జిల్లాలో 30,481 మంది అన్నదాతల నుంచి 3.53 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం సేకరించింది. దీని విలువ రూ.814 కోట్లు.ఇప్పటి వరకు రైతులకు రూ.721 కోట్లు చెల్లించేసింది.ఇంకా రూ.93.94 కోట్లు మాత్రమే చెల్లించాల్సి ఉంది. కోనసీమ జిల్లా 22 మండలాల్లో 340 కొనుగోలు కేంద్రాల ద్వారా 33,507 మంది రైతుల ద్వారా రూ.603 కోట్ల విలువైన ధాన్యాన్ని కొనుగోలు చేసింది. రూ.364 కోట్ల వరకు చెల్లింపులు చేసింది.



24 గంటల్లో సొమ్ము జమ
మంత్రి కందుల దుర్గేష్

నిడదవోలు, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా 30,988 మంది రైతుల ఖాతాల్లోకి 24 గంటల్లో ధాన్యం సొమ్ము జమ అవుతుందని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫి శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన వివరాలు వెల్లడించారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో బుధవారం జరిగిన కేబినెట్ సమావేశంలో కూటమి ప్రభుత్వం రైతాంగానికి తీపి కబురు అందించిందన్నారు. పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ కేంద్ర ప్రభుత్వంతో చర్చించారన్నారు.ధాన్యం పాత బకాయిలు వెయ్యి కోట్లకు రూ.672 కోట్ల విడుదలకు కేంద్రం అంగీకరించిందని తెలిపారు.



కార్మికలోకం కదిలింది.. సమస్యలపై నినదించింది.. సార్వత్రిక సమ్మెను పురస్కరించుకుని రాజమహేంద్రవరంలో బుధవారం ఎర్రజెండాలతో రోడ్డెక్కి తమ డిమాండ్ల సాధనకు గొంతెత్తారు.. అన్ని కార్మిక సంఘాలు ఉద్యమించాయి.. ఉదయం నుంచి సాయంత్రం వరకు జిల్లాలో బంద్ ప్రశాంతంగా ముగిసింది. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. - వివరాలు 8లో

నేడే బడి పండుగ

- 1664 పాఠశాలలు, కళాశాలల్లో నిర్వహణ
- 5 లక్షల మంది హాజరవుతారని అంచనా



రాజమండ్రి ఎస్‌కేవీటీ కళాశాలలో ఏర్పాట్లు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

బడి పండుగకు పాఠశాలలు సిద్ధమయ్యాయి.. పచ్చని తోరణాలతో అలకరించుకున్నాయి.ప్రభుత్వం గతేడాది మాదిరిగానే నిర్వహిస్తున్న 'మెగా పేరెంట్ టీచర్ మీటింగ్'కి బడులు, జూనియర్ కళాశాలల్లో ఏర్పాట్లు పూర్తయ్యాయి. దాదాపు 5 లక్షల మంది హాజరయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో అటు ఉపాధ్యాయులకు బోధనకు సమయం లేకపోగా.. ఇటు విద్యార్థుల చదువు అటకెక్కింది. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత రేపటి పౌరుల బంగారు భవిత కోసం విద్యారంగాన్ని గాడిలో పెట్టే పని మొదలుపెట్టింది. ప్రతి పాఠశాలలోని, ప్రతి విద్యార్థిపై దృష్టి సారించారు. గతేడాది ప్రభుత్వ పాఠశా లల్లో మాత్రమే నిర్వహించిన ఈ వేడుకలను.. ఈసారి ప్రైవేటు పాఠశా లలు, ఇంటర్మీడియట్ కళాశాలలకు విస్తరించారు. దీనిలో విద్యార్థి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు/సంరక్షకులు కూర్చుని విద్యార్థి భవిష్యత్తు,బడి అభివృద్ధే లక్ష్యంగా స్నేహ పూర్వకంగా చర్చిస్తారు. ముఖ్యంగా పాఠశాలలకు పాలకులు ఇస్తున్న నిధులు,చేస్తున్న అభివృద్ధి, చదువుకోవడానికి కల్పిస్తున్న వాతావరణం ఇవన్నీ పారదర్శకంగా ఉంచ డానికి వీలు కలుగుతుంది. జిల్లాలో 976 ప్రభుత్వ, 568 ప్రైవేటు, 120 ఇంటర్మీడియట్ కళాశాలల్లోని విద్యార్థులు,తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు..ఆ ప్రాంతంలోని ప్రజాప్రతినిధులు వేడుకలకు హాజరుకానున్నారు.ఈ మేరకు ఇప్పటికే ప్రభుత్వం నిధులు విడు దల చేసింది.పిల్లల బంగారు భవితకు ఒక్క అడుగు ముందుకు అనే నినాదంతో భారీ కార్యక్రమానికి పాఠశాలలను సిద్ధం చేశారు.ఇప్పటికే ఆయా పాఠశాలలు,కళాశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థుల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులు/సంరక్షకులు పండుగకు రావాలంటూ ఆహ్వాన పత్రికలు అందజేశారు.కార్యక్రమ నిర్వహణపై ఇప్పటికే కలెక్టర్ పి.ప్రశాంతి సమీక్ష చేసి స్పష్టమైన ఆదేశాలిచ్చారు.

అందరూ హాజరుకావాలి..



ఇదొక అద్భుతమైన కార్యక్రమం. అన్ని ఏర్పాట్లూ చేశాం. పిల్లల బంగారు భవితకు, విద్యాలయ అభివృద్ధికి స్నేహపూర్వక వాతావ రణంలో చర్చ జరుగుతుంది. తల్లిదండ్రులకు భోజన ఏర్పాట్లు చేశాం. ప్రతి విద్యార్థి ప్రస్తుత స్థితిని తల్లిదండ్రులకు వివరించడమే కాకుండా వారి సలహాలు, సూచనలు స్వీకరిస్తాం. ఇప్పటికే ఆహ్వాన పత్రికలు అందజేశాం. అందరూ హాజరు కావాలి.

- కె.వాసుదేవరావు,డీఈవో, తూర్పుగోదావరి



పాదగయ క్షేత్రంలో స్వయంభూ దత్తాత్రేయ స్వామి

స్వయంభూగా వెలసిన దత్తాత్రేయుడు కొలువై ఉన్న క్షేత్రం, శ్రీపాద శ్రీవల్లభుల జన్మస్థానమైన మహా సంస్థానం, పలు దత్తపీఠాలకు నెలవుగా ఉన్న పిఠాపురం గురు పౌర్ణమికి సిద్ధమైంది. పట్టణంలోని దత్త క్షేత్రాలు, సాయిబాబా ఆలయాల్లో ఈ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించేందుకు ఆయా ఆలయ కమిటీల సభ్యులు, దేవదాయ శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. దత్త క్షేత్రాల్లో వేడుకలకు ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక, ఒడిసాల నుంచి భక్తులు అధికంగా తరలి వస్తున్నారు. ఇప్పటికే ఆయా ఆలయాల వసతి సముదాయాలు, ప్రైవేటు వసతి గృహాలు, లాడ్జీలు మహారాష్ట్ర, కర్ణాటక భక్తులతో కిటకిటలాడుతున్నాయి.

గురు పౌర్ణమికి ముస్తాబు



శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానంలో శ్రీపాద శ్రీవల్లభుడు, దత్తాత్రేయుడు, నృసింహ సరస్వతి

పిఠాపురం జూలై 9 (ఆంధ్రజ్యోతి): గురుపౌర్ణమి సందర్భంగా పట్టణంలోని పాదగయ క్షేత్రంలో స్వయంభూగా వెలసిన దత్తాత్రేయస్వామికి, ఆవరణలో ఉన్న అలక్‌నిరంజన్ దత్త బృందావనంలో పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు జరగనున్నాయి. దత్తాత్రేయ స్వామికి లక్ష గులాబీలతో అర్చన నిర్వహిస్తారు. సాయంత్రం పల్లకి, ఊయల సేవలు జరుగుతాయి. ఇందుకు సంబంధించి దత్తగురువు వాడ్రేవు శ్రీనివాసరావు, ఆలయ అధికారుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు.

శ్రీపాద శ్రీవల్లభుని జన్మస్థానంగా దేశవ్యాప్తంగా ప్రసిద్ధి గాంచిన పట్టణంలోని శ్రీపాదవల్లభ సంస్థానంలో గురు పౌర్ణమి సందర్భంగా శ్రీపాద శ్రీవల్లభులకు అభిషేకాలు, గురు పూజ. సర్వపుష్పపూజ, పల్లకి సేవ, ఇతర కార్యక్రమాలు ఉంటాయి. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్రలకు చెందిన భక్తులు ఇప్పటికే పిఠాపురం చేరుకున్నారు. ఈ ఏడాది గురుపౌర్ణమి గురువారం రావడంతో భక్తుల రద్దీ అధికంగా ఉండనుంది,

పట్టణంలోని బైపాస్ రోడ్డులో గల గోపాల్ బాబా ఆశ్రమం, సినిమా సెంటర్లోని షిర్డీ సాయినాథ్ మందిరంలో, మెయిన్‌రోడ్డులో గల సాయిబాబా ఆలయంలో గురు పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు జరగనున్నాయి. పట్టణ శివారులోని విశ్వ విజ్ఞాన విద్య, ఆధ్యాత్మిక పీఠం నూతన ఆశ్రమ ప్రాంగణంలో గురుపౌర్ణమి సభ జరగనుంది. పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా భక్తులకు అనుగ్రహ భాషణ చేస్తారు. పట్టణంలోని సాయిబాబా, దత్త ఆలయాలు అన్నింటినీ ఇప్పటికే ముస్తాబు చేశారు.

నేటి నుంచి చాతుర్మాస్య వ్రత దీక్షా మహోత్సవం

పిఠాపురంలో చేపట్టనున్న మైసూరు దత్త పీఠం ఉత్తరాధికారి దత్తవిజయానంద స్వామీజీ

సెప్టెంబరు 9 వరకు అనఘా దత్త క్షేత్రంలో ప్రత్యేక కార్యక్రమాలు... అష్టమ కోటి దత్త యాగం నిర్వహణ



పిఠాపురం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): హిందూ ధర్మంలో అత్యంత పవిత్రంగా భావించే చాతుర్మాస్య వ్రత దీక్షా మహోత్సవానికి పిఠాపురం వేదిక కానుంది. మైసూరు దత్త పీఠం ఉత్తరాధికారి దత్త విజయానంద తీర్థ స్వామీజీ పట్టణంలోని అగ్రహారంలో కొలువై ఉన్న అనఘా దత్త క్షేత్రంలో గురువారం దీక్ష చేపట్టి సెప్టెంబరు 7వ తేదీ వరకు కొనసాగించనున్నారు. ఇందునిమిత్తం విస్తృత ఏర్పాట్లు జరుగుతున్నాయి.

దత్త విజయానంద స్వామి చాతుర్మాస్య దీక్ష చేపట్టిన అనంతరం గురుపౌర్ణమి పూజలు, చైతన్యార్చన, పవమాన హోమం, దత్త హోమం, గురు గీతా పారాయణ జరుగుతాయి. నవకోటి దత్తయాగ మహా సంకల్పంలో భాగంగా ఈ నెల 10 నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు అష్టమకోటి దత్త యాగం జరుగుతుంది. దీనికి అంకుర్పారణ చేస్తారు. 11వ తేదీ రాత్రి 7 గంటలకు చాతుర్మాస్య ప్రవచనం ప్రారంభిస్తారు. ఈ నెల 11 నుంచి ఆగస్టు 3వ తేదీ వరకు యజుర్వేద పారాయణ, ఈ నెల 17 నుంచి 27వ తేదీ వరకు శత చండీయాగం, ఈ నెల 25 నుంచి ఆగస్టు 23వ తేదీ వరకు శ్రావణమాస ప్రయుక్త కుంకుమార్చన, ఆగస్టు 3 నుంచి 8వ తేదీ వరకు సంపూర్ణ కృష్ణయజుర్వేదీయ మూల పారాయణం, 8న వరలక్ష్మీ వ్రతం, 9న రాఖీ పౌర్ణమి, హయగ్రీవ జయంతి, శ్రీనివాస కల్యాణం, 16న వెయ్యి మంది దంపతులతో అనఘాష్టమి వ్రతం, శ్రీకృష్ణాష్టమి గోపూజ, 23, 24 తేదీల్లో ప్రాజాప్రత్యేష్టి, సారస్వతేష్టి యాగం, 24న అనఘాలక్ష్మీ సమేత దత్త సత్యనారాయణస్వామికి దివ్య కల్యాణం, 28న దత్త పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామీజీరాక, సెప్టెంబరు 7న చాతుర్మాస్య వ్రత పరిసమాప్తి, పవనమాన హోమం జరుగుతాయి.

అనఘా దత్త క్షేతంలో జరిగే పల్లకీ సేవ, రథోత్సవం, మంటపోత్సవం, తెప్పోత్సవం, డోలోత్సవంలో భక్తులు స్వయంగా పాల్గొనే అవకాశం కల్పించారు. దీక్షా మహోత్సవాలు జరిగే సమయంలో ప్రతి ఆదివారం ఉచిత ఆయుర్వేద, అల్లోపతి వైద్య సేవలు అందించనున్నారు. చాతుర్మాస్య దీక్షా మహోత్సవానికి ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాపంగా ఉన్న భక్తులు, గణపతి సచ్చిదానంద స్వామి శిష్యులు తరలివచ్చే అవకాశం ఉండడంతో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో తొలి షిర్డీసాయి ఆలయం

ఆలమూరులో గురు పౌర్ణమికి ప్రత్యేక ఏర్పాట్లు



ఆలమూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోనే తొలి షిర్డీసాయి ఆలయంగా ఖ్యాతిగాంచింది ఆలమూరులోని షిర్డిసాయిబాబా ఆలయం. జొన్నాడ-రావులపాలెం వారధి నిర్మాణ కాంట్రాక్టరు చెలంకూరి సుబ్బారావు 1956లో ఈ ఆలయాన్ని నిర్మించారు. షిర్డీలో ఉన్న బాబా విగ్రహాన్ని రూపొందించిన శిల్పి లాల్లిమ్ ఇక్కడ పాలరాతితో విగ్రహాన్ని చెక్కడం విశేషం. అప్పట్లో అంతగా ఆదరణ లేక పోయినప్పటికీ తర్వాత రోజుల్లో భక్తుల తాకిడి అధికమైంది. స్వయంగా బాబానే ఇక్కడికి వచ్చారనే భావన ఇక్కడి షిర్డీసాయిని దర్శించుకున్న భక్తులకు కలుగుతుంది. దాదాపు మూడు దశాబ్దాల క్రితం మండపేటలో రవాణా శాఖ అధికారిగా పని చేసిన కె.సాయోజీరావు ఇక్కడ ఆలయాన్ని దర్శించి స్థానికులతో అభివృద్ధిపై చర్చించారు. ఆలయం ముందు వున్న షాపులను తొలగించి ఆలయం రోడ్డుపైకి కనిపించేలా చేయడంలో ఆయన విశేష కృషి చేశారు. కమిటీ ఏర్పాటు చేసి నిత్యం పూజలు జరిగేలా చేయడంతో సాయి భక్తులు పెరిగారు. గురువారం గురుపౌర్ణమి సందర్భంగా భారీ ఏర్పాట్లు చేసినట్టు ఆలయ కమిటీ చైర్మన్ చల్లా ప్రభాకరరావు తెలిపారు. బాబాకు ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తామన్నారు. వేలాది మంది భక్తులకు అన్నసమారాధన చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామని ఆయన చెప్పారు.



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం ఈదరాడ స్కూలులో ఎంపీటీఎం ఆకృతిలో ఒదిగిన విద్యార్థులు

పీటీఎంకు వేళాయె...

పాఠశాలల్లో గురువారం మెగా పేరెంట్-టీచర్ మీటింగ్ (పీటీఎం) నిర్వహించనున్నారు. ఇందుకు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని కొన్ని స్కూల్సులో ఉపాధ్యాయలు, విద్యార్థులు విభిన్నంగా ఏర్పాట్లు చేస్తున్నారు. వాటిని మీరూ చూడండి.



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం మానేపల్లి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో కాగితపు పూలతో మెగా పీటీఎం స్వాగత ద్వారాన్ని తయారు చేస్తున్న విద్యార్థినులు





తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ హైస్కూల్లో స్వాగత బ్యానర్ (పైన) ఫొటో షూట్ కోసం ఏర్పాట్లు (కింద)



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట కాంతిభారతి స్కూల్లో...

యువతకు కువైట్‌లో ఉపాధి అవకాశాలు

రాజమహేంద్రవరం సిటీ, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ ఆఫ్ ఏపీ సంయుక్తంగా తురియా అనే అంతర్జాతీయ సంస్థతో కలిసి కువైట్‌లో నిర్మాణ రంగంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి వీడీజీ మురళీ తెలిపారు. ఈమేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాకు చెందిన 24 నుంచి 50 ఏళ్ల మధ్య గల పురుష అభ్యర్థులు అర్హులన్నారు. సిరామిక్ ఫ్లోరింగ్, పెయింటింగ్, ఎలక్ట్రికల్, సీలింగ్ పనులు ఉంటాయన్నారు. దీనికి ఐటీఐ లేదా డిప్లొమా కలిగి ఉండాలని, అలాగే మూడు నుంచి ఐదేళ్ల అనుభవం తప్పనిసరి అని పేర్కొన్నారు. ఎంపికైన అభ్య ర్థులకు సుమారు రూ. 56 వేల నుంచి 70 వేలు వరకు ఉంటుందన్నారు. మరింత సమాచారం కోసం 99888 53335 ఫోన్‌నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు. వీసా ప్రొసెసింగ్, విమాన టికెట్లు, వైద్య సదుపాయాలు, నివాస ఏర్పాట్లు కంపెనీయే అందిస్తుందన్నారు. ఆసక్తిగల వారు తమ దరఖాస్తులను హెటిటిపిఎస్://నైపుణ్యం.ఏపి.జీవోవి.ఇన్‌లో చూడవచ్చన్నారు. లేదా ఈనెల 12వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సత్యదేవ నర్సరీని సందర్శించిన కేంద్ర మాజీ మంత్రి



శ్రీరామ్ సాహెబ్ దాన్వేకు మొక్క అందిస్తున్న దృశ్యం

కడియం, జూలై 9(ఆంధ్రజ్యోతి): కడియపులంక సత్యదేవ నర్సరీని బుధవారం కేంద్ర రైల్వే మాజీమంత్రి, సీనియర్ బీజేపీ నేత శ్రీరామ్ సాహెబ్ దాన్వే సందర్శించారు. ఆయన్ని నర్సరీ అధినేత పుల్లా పెదసత్యనారాయణ మొక్కను అందజేసి శ్రీరామ్ సాహెబ్ దాన్వేకు స్వాగతం పలికారు. ఆయన కుటుంబసభ్యులతో విచ్చేసి పలురకాల మొక్కలను చూశారు. వాటి విశిష్టతలు అడిగి తెలుసుకున్నారు. కొన్నిరకాల మొక్కలను కొనుగోలు చేసి తీసుకెళ్ళారు. 2021 నుంచి 2024 వరకు కేంద్ర రైల్వేశాఖ మంత్రిగా ఉన్నానని చెప్పారు. కుమార్తె సంజన శివసేన పార్టీలో 2024లో ఎమ్మెల్యేగా గెలుపొందారన్నారు. కార్యక్రమంలో బాబా గ్రూప్స్ చైర్మన్ ప్రవీణ్‌చంద్, పుల్లా నాగేంద్ర, మాగాపు సూర్య, మెర్ల కృష్ణమూర్తి, గట్టి రమేష్, ఎన్. ప్రేమసాగర్, టీ. కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

విజయ శంకర సంగీత పాఠశాలలో ప్రవేశాలు

రాజమహేంద్రవరం కల్చరల్ జూలై 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక విజయ శంకర సంగీత నృత్య పాఠశాలలో 2025-26 విద్యాసంవత్సరానికి కర్ణాటక సంగీతం, గాత్రం, వాయిద్యం, నాట్యం, మృదంగం, డోలు, శాస్త్రీయ నృత్య విభాగాలలో నాలుగు సంవత్సరాల డిప్లొమా కోర్సులు , రెండు సంవత్సరాల సర్టిఫికెట్ కోర్సులు నిర్వహించనున్నట్టు ప్రభుత్వ సంగీత పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. ఆసక్తికలిగిన విద్యార్థుల ఎంపికకు కర్ణాటక సంగీతం, డ్యాన్స్, నాట్యం, తదితర విభాగాలలో ప్రతిభా ప్రదర్శన ఆధారంగా ఎంపిక పరీక్ష నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కోర్సులో చేరే విద్యార్థులు జూలై 1 నాటికి 10 సంవత్సరాలు, డిప్లమా కోర్సులో చేరే విద్యార్థులు జూలై1 నాటికి 15 సంవత్సరాలు నిండి ఉండాలని, సర్టిఫికెట్, డిప్లమా కోర్సులలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తమ దరఖాస్తులను ఈనెల 31 లోగా సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. ఫీజు వివరాలు, తదితర పూర్తి వివరాల కోసం ఫోన్ నెంబర్ 0883 - 2421669కు కార్యాలయ పని వేళల్లో ఉదయం 10.30 నుంచి సాయంత్ర 5 గంటల్లోగా సంప్రదించాలని సూచించారు.

● సంగీత పాఠశాల ప్రిన్సిపాల్‌గా శ్రీనివాసశర్మ



విజయ శంకర ప్రభుత్వ సంగీత, నృత్య పాఠశాల ప్రిన్సిపాల్‌గా పసుమర్తి శ్రీనివాస శర్మ బాధ్యతలు స్వీకరించినట్టు పాఠశాల యాజమాన్యం బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఇప్పటి వరకు ప్రిన్సిపాల్‌గా పనిచేసిన మండపాక నాగలక్ష్మి పదోన్నతిపై విజయనగరం మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలకు బదిలీ అయ్యారు.

కాకినాడ జిల్లా రెడ్‌క్రాస్‌కు అవార్డుల పంట

● సంస్థ అధ్యక్షుడు, గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతులమీదుగా ప్రదానం



విజయవాడలో పురస్కారం అందుకుంటున్న వైడీ రామారావు

కార్పొరేషన్(కాకినాడ), జూలై9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉత్తమ రెడ్‌క్రాస్ జిల్లా శాఖగా ప్రసిద్ధి గాంచిన కాకినాడ రెడ్‌క్రాస్ మరోసారి సత్తా చాటింది. బుధవారం విజయవాడలో జరిగిన రెడ్‌క్రాస్ రాష్ట్ర సర్వసభ్య సమావేశం పురస్కార బహూకరణ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు, గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ 2021- 22, 2022-23, 2023-24 సంవత్సరాలకు చెందిన రాష్ట్ర స్థాయి పురస్కారాలను అందజేశారు. ఆయాసంవత్సరాలకు కాకినాడ జిల్లా శాఖ మొదటి స్థానాన్ని గెలుచుకుంది. దీనిలో భాగంగా 2021-22 సంవత్సర పురస్కారాన్ని జిల్లా చైర్మన్ వైడి రామారావు, 2022-23 సంవత్సర పురస్కారాన్ని వైస్ చైర్మన్ డాక్టర్ ఎన్.సుగుణ, 2023-24 సంవత్సర పురస్కారాన్ని కోశాధికారి ఎన్‌వీవీఆర్‌కే ప్రసాద్ బాబు గవర్నర్ చేతు లమీదుగా అందుకున్నారు. రెడ్‌క్రాస్‌కు అత్యధిక విరాళాలు అందించడంలో సహకరించిన ఓఎన్ జీసీ ఈడీ అనుపమ్ సక్సేనా, ప్రతినిధి షాదాబ్ అన్వర్, కాకినాడ సీ పోర్ట్స్ ప్రతినిధులు మొహ్మద్ ఖాసీం, మొహద్‌కరీమ్, సాయిరామ ఫ్రోజెన్ ఫుడ్స్ అధినేత ఎల్. సత్యనారాయణ, ఫిలిం డైరెక్టర్ బి.సుకుమార్ తరఫున బి.అశోక్, హౌసింగ్ పీడీ ఎన్‌వీ వీ సత్యనారాయణ, సంస్థ కార్యదర్శి కె.శివకుమార్, కార్యవర్గ సభ్యులు ఎస్‌వీఎం చంద్రశేఖర్ పురస్కారాలు అందుకున్నారు. 2017-18లో అత్యుత్తమ జిల్లా శాఖలకు పురస్కారం ప్రారంభించినప్పటి నుంచి వరుసగా కాకినాడ జిల్లా శాఖ రాష్ట్రంలో అగ్రగామిగా మొత్తం ఏడుసార్లు పురస్కారం పొందడం గర్వకారణమని రాష్ట్ర శాఖ అధ్యక్షుడు, గవర్నర్ రెడ్‌క్రాస్ కాకినాడ జిల్లా అధ్యక్షుడు, కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి, వైడి రామారావు, కార్యవర్గ సభ్యులను అభినందించారు.



రావి ఆకుపై సాయినాథుడు

విద్యార్థిని రూపొందించిన చిత్రం

అనపర్తి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): గురుపౌర్ణమిని పురస్కరించుకుని అనపర్తి మండలం మహేంద్రవాడకు చెందిన విద్యార్థిని బద్దిరాజు లక్ష్మీసుప్రజా పార్వతి రావి ఆకుపై సాయి నాథుడి చిత్రాన్ని రూపొందిస్తూ తన భక్తిభావాన్ని చాటుకుంది. ఈ చిత్రం పలువురిని ఆకట్టుకుంది.

31 వరకు హజ్ యాత్రకు దరఖాస్తులు

రాజమహేంద్రవరం సిటీ/ కార్పొరేషన్ (కాకినాడ), జూలై 9 (ఆంధ్రజ్యోతి): హజ్ కమిటీ ఆఫ్ ఇండియా వారు హజ్‌యాత్ర 2026లో యాత్రకు వెళ్లేవారు ఈనెల 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి ఎం. సునీల్ కుమార్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

ఎస్సీ, బీసీ హాస్టళ్లలో ఆకస్మిక తనిఖీలు

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం నగరంలోని ఎస్సీ, బీసీ బాలుర, బాలికల సంక్షేమ వసతిగృహాలను బుధవారం సాయంత్రం రెవెన్యూ, మున్సిపల్ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అర్బన్ తహశీల్దార్ పి. పాపారావు, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ వినూత్న, సిటీ ప్లానర్, ముగ్గురు ఇంజనీరింగ్ అధికారులు ఈ తనిఖీలు జరిపారు. ఒక్కొక్క అధికారి మూడు హాస్టళ్ల చొప్పున మొత్తం 18 హాస్టళ్లను తనిఖీ చేసినట్టు తెలిసింది. హాస్టళ్లలో విద్యార్థుల హాజరు, బియ్యం, కోడిగుడ్ల స్టాకు, మౌలిక సదుపాయాలు వంటివన్నీ పరిశీలించారు. మెనూ ప్రకారం ఆహారం సక్రమంగా పెడుతున్నారా, కోడిగుడ్డు ఇస్తున్నారా, ఏమైనా సమస్యలున్నాయా వంటి వివరాలను ఆరా తీశారు. విద్యార్థుల హాజరును గూగుల్‌షీట్ యాప్‌లో అప్‌లోడ్ చేసినట్టు సమాచారం. వసతిగృహాల్లో తనిఖీలకు సంబంధించిన పూర్తి వివరాలను కలెక్టర్‌కు నివేదికరూపంలో అందజేసే అవకాశం ఉంది. కాగా, రెవెన్యూ, మున్సిపల్ ఉన్నతాధికారులు హాస్టళ్లను ఆకస్మికంగా తనిఖీ చేయడంతో వార్డెన్లు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. హాస్టల్ వార్డెన్లందరికీ బుధవారం సెలవు. సరిగ్గా ఇదే రోజున ఆకస్మిక తనిఖీలు చేపట్టడం గమనార్హం. ప్రధానంగా సంబంధిత ఎస్సీ, బీసీ సంక్షేమ శాఖల అధికారులను పక్కనబెట్టి తహశీల్దార్ స్థాయి అధికారులను తనిఖీలకు పంపడంతో విద్యార్థుల హాజరులో అవకతవకలకు పాల్పడిన అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.

పవన్‌ను విమర్శించే స్థాయి జక్కంపూడికి లేదు

● పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ఫైర్



పి.గన్నవరంలో విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

పి.గన్నవరం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను విమర్శించే స్థాయి రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజాకు లేదని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ఫైర్‌అయ్యారు. కోనసీమ జిల్లా పి.గన్నవరం జనసేన క్యాంపు కార్యాలయంలో బుధవారం విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యే గిడ్డి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో చేసిన అకృత్యాలు ఒక్కసారి గుర్తుచేసుకోవాలన్నారు. రియల్‌ఎస్టేట్ వారిని ఇబ్బంది పెట్టి డబ్బులు దండుకున్న మీకు మా అధినేతను విమర్శిస్తారా అని దుయ్యబట్టారు. రాజా తన తండ్రి వారసత్వంతో రాజకీయాల్లోకి రాగా, పవన్ మాత్రం గొప్ప దేశభక్తి భావజాలం, స్వశక్తితో వచ్చారన్నారు. సినిమాలు, రాజకీయాల్లోనే కాదు నిజ జీవితంలోనూ మా అధినేత హీరోనే అన్నారు. ఇకనైనా ఇటువంటివి పునరావృతం కాకుండా చూసుకోవాలని హెచ్చరించారు. మహిళల ఆత్మ గౌరవాన్ని, వ్యక్తిత్వాన్ని అవమానించేలా ప్రసన్న కుమార్‌రెడ్డి మాట్లాడటంపై వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. ఆయనే స్వయంగా ఆ వ్యాఖ్యలను సమర్థించడం ఎంతవరకు సబబని ఆయన ప్రశ్నించారు. చిట్టూరి శ్రీనివాస్, సత్తిబాబు రాజు, పెనుమాల లక్ష్మి, సంసాని పెద్దిరాజు, బొంతు పెదబాబు, వాసంశెట్టి కుమార్, జాలెం శ్రీనివాసరాజా, గణపతి రాఘవులు, దొమ్మేటి సాయికృష్ణ, పత్తిపాటి వెంకన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసుల కుటుంబాలకు ఆర్థికసాయం



జిల్లా పోలీసు కార్యాలయంలో చెక్కులు అందజేస్తున్న ఎస్పీ కృష్ణారావు

అమలాపురం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసులకు జిల్లా పోలీసులు రూ. 8 లక్షల ఆర్థిక సాయాన్ని అందించారు. గత నెల 26న ఓ కేసుకు సంబంధించి ఆలమూరు నుంచి హైదరాబాద్ వెళుతున్న ఎస్ఐ మద్దాల అశోక్, ఆత్రేయపురం కానిస్టేబుల్ బ్లెసన్‌జీవన్ కోదాడ వద్ద జరిగిన రోడ్డుప్రమాదంలో మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ మేరకు. జిల్లాలోని పోలీస్ అధికారులు, సిబ్బంది సేకరించిన మొత్తాన్ని ఎస్పీ బి.కృష్ణారావు బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో అశోక్ కుటుంబానికి రూ. నాలుగు లక్షలు, జీవన్ కుటుంబానికి రూ. నాలుగు లక్షలు చొప్పున చెక్కులు అందించారు. అలాగే 2014 బ్యాచ్‌కు చెందిన ఎస్ఐలు అదనంగా రూ.68వేల చెక్కును ఎస్పీ చేతులమీదుగా అశోక్ కుటుంబ సభ్యులకు అందజేశారు.

రంగులే.. తీరం కొత్త రూపులే..


కాకినాడ జిల్లా ఉప్పాడలో రంగులుగా మారిన సముద్ర తీరం

కొత్తపల్లి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఉప్పాడ తీరంలో సముద్రం బుధవారం రంగురంగులుగా దర్శనమిచ్చింది. ఇటీవల వర్షాలు కురవడంతో ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరద నీరు వివిధ పాయల ద్వారా సముద్రంలోకి చేరుతోంది. అక్కడి నుంచి నుంచి బురద నీరు నేరుగా సముద్రంలోకి ప్రవేశించడంతో నీలి రంగులో ఉండే సముద్రం సగభాగం బురద, కొంచెం మేర నీలి రంగు, మరి కొంత భాగం తెలుపురంగులో దర్శనమిస్తోంది. రంగులుగా దర్శనమిస్తున్న సముద్రాన్ని పర్యాటకులు, ప్రయాణికులు ఆసక్తిగా తిలకిస్తూ ఫొటోలు తీసుకుంటున్నారు.

చోరీ కేసులో ముగ్గురి అరెస్టు

22 కాసుల బంగారు ఆభరణాలు, రూ.1.15 లక్షల నగదు స్వాధీనం


రాజానగరం పోలీస్‌స్టేషన్‌లో నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ

రాజానగరం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా రాజానగరం పోలీస్ స్టేషన్ పరిధిలోని నామవరంలో ఇటీవల జరిగిన చోరీ కేసుకు సంబంధించి నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నట్టు డీఎస్పీ వై.శ్రీకాంత్ తెలిపారు. ఈమేరకు రాజానగరం పోలీస్‌స్టేషన్‌లో బుధవారం విలేకర్ల సమావేశంలో వివరాలను వెల్లడించారు. నామవరం గ్రామానికి చెందిన రేలంగి లోవరాజు ఈ నెల 2న కుటుంబ సభ్యులతో కలిసి కాకినాడ జిల్లా తుని మండలం తలుపులమ్మ లోవ అమ్మ వారి దర్శనానికి బయలుదేరి వెళ్లి తిరిగి రాత్రికి ఇంటికి చేరుకున్నారు. ఇంటి తలుపులు తెరిచి ఉండడాన్ని గమనించిన లోవరాజు లోపలికి వెళ్లి చూడగా బీరువా తాళాలు బద్దలు కొట్టి 22 కాసుల బంగారు ఆభరణాలు, రూ.1.75 లక్షల నగదును దొంగలు అపహరించినట్టుగా గుర్తించారు. లోవరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాజానగరం పోలీసులు కేసు నమోదు చేశారు. జిల్లా ఎస్పీ నరసింహకిషోర్ ఆదేశాల మేరకు నార్త్ జోన్ డీఎస్పీ వై.శ్రీకాంత్ పర్యవేక్షణలో కేసు దర్యాప్తు చేపట్టారు. సీఐ ప్రసన్న వీరయ్యగౌడ్‌కు అందిన సమాచారం మేరకు రాజమహేంద్రవరం రూరల్ శాటిలైట్ సిటీ గ్రామానికి చెందిన నలబా సత్యనారాయణ, రాజవోలు గ్రామానికి చెందిన బెదంపూడి రత్నరాజు, ఇనకోటి పవన్‌కుమార్‌ను బుధవారం అరెస్టు చేసినట్టు డీఎస్పీ వెల్లడించారు. చోరీకి గురైన బంగారు ఆభరణాలతో పాటు రూ. 1.15 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నామ న్నారు. నిందితులను పట్టుకున్న సీఐ ప్రసన్న వీ రయ్య గౌడ్, సీసీఎస్ సీఐలు శ్రీధర్‌కుమార్, బలసౌరి, ఎస్‌ఐలు కే.నాగార్జున, సిబ్బంది అ మ్మిరా జు, సత్యనారాయణ, కరీం, సురేష్, మురళీ, ప్ర సాద్, రమణ, శివరామకృష్ణను అభినందించారు.

జాతీయస్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీలకు అప్పన్న ఎంపిక

అమలాపురం టౌన్, జూలై 9(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీలకు కోనసీమ జిల్లా అమలాపురం హెల్త్ అండ్ ఫిట్‌నెస్ జిమ్ సీనియర్ పవర్ లిఫ్టర్ బి.అప్పన్న ఎంపికైనట్టు జిమ్ కోచ్ కంకిపాటి వెంకటేశ్వరరావు తెలిపారు. ఆగస్టు 2 నుంచి 7వ తేదీ వరకు కేరళలోని కోసిఫుడ్‌లో జరిగే మాస్టర్స్, నేషనల్ పవర్ లిఫ్టింగ్ పోటీలకు రాష్ట్రం నుంచి అప్పన 120 కిలోల విభాగంలో ఎంపికయ్యారు. అప్పన్నను బుధవారం స్థానిక హెల్త్ అండ్ ఫిట్‌నెస్ జిమ్‌లో గారపాటిచంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అభినందించి సత్కరించారు. మాజీ కౌన్సిలర్ ఆశెట్టి ఆదిబాబు, మట్టపర్తి వెంకటసముద్రం, గంగుమళ్ల దొరబాబు, యనమదల పల్లంరాజు, నక్కా సుధాకర్‌బాబు, వీరేంద్ర పాల్గొన్నారు.


అప్పన్నను అభినందిస్తున్న జిమ్ సభ్యులు

గొల్లప్రోలులో వైసీపీకి గట్టి షాక్

- డిప్యూటీ సీఎం పవన్ ప్రతిపాదించిన పనులను అడ్డుకున్న వైసీపీ పాలకులు
- గొల్లప్రోలు కౌన్సిల్‌ను పక్కనపెట్టి ఆమోదించిన కాకినాడ జిల్లా కలెక్టర్
- మున్సిపల్ చట్టంలోని విచక్షణాధికారాన్ని వినియోగించుకుంటూ గ్రీన్‌సిగ్నల్
- పనుల నిర్వహణకు తొలగిన అడ్డంకి



గొల్లప్రోలు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు నగర పంచాయతీ వైసీపీ పాలకులకు గట్టి షాక్ తగిలింది. పట్టణాభివృద్ధి కోసం డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ తెచ్చిన నిధులతో పనులు చేపట్టకుండా రెండు నెలలుగా అడ్డంకు లు సృష్టిస్తున్న ఆ పార్టీ ప్రజాప్రతినిధుల తీరుకి చెక్ పెడుతూ కాకినాడ జిల్లా కలెక్టర్ నిర్ణయం తీసుకున్నారు. మున్సిపల్ చట్టం ప్రకారం తనకు సంక్రమించిన విచక్షణాధికారాలను వినియోగించుకుంటూ పనులకు పరిపాలనామోదం ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో పనులు చేపట్టేందుకు వీలు ఏర్పడింది. గ్రామాల అభివృద్ధికి పు ష్కలంగా నిధులు సాధించడంతో పాటు పనులు వేగంగా జరుగుతుండడంతో పట్టణాల అభివృద్ధిపై దృష్టి పెట్టిన డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రత్యేక చొరవ తీసుకుని పిఠాపురంలో అభివృద్ధి పనుల నిర్వహణ నిమిత్తం రూ.3 కోట్లు, గొల్లప్రోలుకు రూ.కోటి మంజూరు చేయించారు. ఈ నిధులతో ఆయా పట్టణాల పరిధిలో అత్యవసరంగా చేపట్టాల్సిన రోడ్లు, డ్రైన్లు, ఇతర పనులను ప్రతిపాదించారు. ఈ పనులు చేపట్టేందుకు ఇప్పటికే పిఠాపురం మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం తెలపడంతో పాటు టెండర్లు పిలిచారు. త్వరలోనే పనులు ప్రారంభించనున్నారు. అయితే గొల్లప్రోలు పట్టణంలో అందుకు విరుద్ధమైన పరిస్థితి నెలకొంది.

తొలి నుంచీ ఆటంకాలే..

కలెక్టర్ సూచనలకు అనుగుణంగా గొల్లప్రోలు పట్టణానికి మంజూరైన రూ.కోటితో వివిధ ప్రాంతాల్లో 27 రోడ్లు, డ్రైన్లు, కల్వర్టుల నిర్మాణ పనులు ప్రతిపాదించి మే 29న జరిగిన గొల్లప్రోలు నగర పంచాయతీ సాధారణ, అత్యవసర సమావేశాల్లో కమిషనరు కనకరావు టేబుల్ అజెండాగా తీసుకురాగా వైసీపీ చైర్‌పర్సన్, పాలకవర్గం అభ్యంతరం తెలిపి వాయిదా వేశారు. అయితే టేబుల్ అజెండాను మినిట్స్ బుక్‌లో కూడా నమోదు చేయలేదు. జూన్‌లో వాయిదా వేసిన అంశాన్ని అజెండాకు రానివ్వకుండా చేసేందుకు కమిషనరు పంపిన అజెండాపై చైర్‌పర్సన్ సంతకం చేయలేదు. దీంతో జూన్ నెలలో సమావేశమే నిర్వహించలేకపోయారు. నిధులు మంజూరై మూడు నెలలు గడిచినా పనులు ముందుకు సాగని పరిస్థితి ఏర్పడింది.

'ఆంధ్రజ్యోతి'లో కథనం..

నగర పంచాయతీలో వైసీపీ పాలకవర్గం డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ తెచ్చిన కోటి రూపాయల నిధులతో ప్రతిపాదించిన పనులకు ఆమోదం తెలపకుండా అడ్డంకులు సృష్టిస్తున్న విషయంపై 'ఆంధ్రజ్యోతి'లో ఈనెల 2న కథనం ప్రచురితమైంది. ఇదే విషయాన్ని నగర పంచాయతీ కమిషనరు కనకారావు కలెక్టర్ షాన్ మోహన్‌కు నివేదించారు. ఈ నేపథ్యంలో ఏపీ మున్సిపల్ చట్టం 1965లోని సెక్షన్ 68 కింద విచక్షణాధికారాన్ని వినియోగించుకుంటూ రూ.కోటితో 27 పనులు చేపట్టేందుకు పరిపాలనా ఆమోదం ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇవి బుధవారం గొల్లప్రోలు నగర పంచాయతీ కార్యాలయానికి చేరాయి. ఇదే విషయంపై కలెక్టర్ ప్రభుత్వానికి నివేదిక పంపారు. కలెక్టర్ ఆదేశాలపై కౌన్సిల్‌కు సమాచారం ఇచ్చి పనులు ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు.

వైసీపీ సమావేశ ఏర్పాట్లలో విద్యుదాఘాతం

ఇద్దరికి తీవ్ర గాయాలు

సామర్లకోట, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట పట్టణ శివారులోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాలు నందు బుధవారం సాయంత్రం పెద్దాపురం నియోజకవర్గ వైసీపీ విస్తృత స్థాయి సమావేశపు ఏర్పాట్లలో భాగంగా వైసీపీ నాయకులు ఫ్లెక్సీలను రోడ్డు పక్కన నిలబెడుతుండగా గాలి వాటానికి విద్యుత్ తీగెలను ఫ్లెక్సీ బోర్డు తాకడంతో విద్యుద్ఘాతానికి ఫ్లెక్సీ బోర్డు పట్టుకున్న వైసీపీ పట్టణాధ్యక్షుడు, కౌన్సిలర్ పాగా సురేష్‌కుమార్, భాస్కర్‌నగర్‌కు చెందిన కార్యకర్త రంపా రాజు తీవ్రంగా గాయపడ్డారు. ఫంక్షన్ హాలులో ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న వైసీపీ ఇన్‌చార్జి దవులూరి దొరబాబు వారిద్దరికి స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ప్రాథమిక చికిత్స చేయించి ఏడీబీ రోడ్డులోని మెడికవర్ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఐసీయూలో చికిత్స పొందుతున్న వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని మెడికవర్ వైద్యులు చెప్పారు.



చికిత్స పొందుతున్న సురేష్, రాజు

డ్వాక్రా సొమ్ము రూ.20లక్షలు స్వాహా

ఇద్దరు యానిమేటర్ల అరెస్టు

అమలాపురం రూరల్, జూలై 9(ఆంధ్రజ్యోతి): డ్వాక్రా సంఘాల మహిళలు వివిధ రకాల రుణాలను బ్యాంకు నుంచి తీసుకున్నారు. క్రమం తప్పకుండా నెలనెలా బ్యాంకుకు వాయిదాలు చెల్లించేందుకు డ్వాక్రా యానిమేటర్లను నమ్ముకున్నారు. వారిలో అత్యధికులు కూలి పనులకు వెళ్లేవారు నిరక్షరాశ్యులు కావడంతో వారు చెల్లించిన లక్షలాది రూపాయల నగదును స్వాహాచేసి చేతులెత్తేశారు. నగదు స్వాహా వ్యవహారం ఈ ఏడాది జనవరిలోనే వెలుగు చూసింది. అయితే స్వాహా చేసిన సొమ్ములు తిరిగి చెల్లిస్తామని నమ్మించి మళ్లీ మోసానికి పాల్పడ్డారు. చివరకు డ్వాక్రా మహిళల ఫిర్యాదుతో మోసానికి పాల్పడ్డ యానిమేటర్లు కటకటాల పాలయ్యారు. కోనసీమ జిల్లా అమలాపురం రూరల్ మండలం పాలగుమ్మి గ్రామంలో డ్వాక్రా మహిళలు చెల్లించిన రూ.20 లక్షలు ఫైబడి నిధులను అదే గ్రామానికి చెందిన విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్(వీవోఏ)లు స్వాహా చేశారు. నిధులు స్వాహా చేసిన డ్వాక్రా యానిమేటర్లు (వీవోఏ) కొల్లు వెంకటలావణ్య, బొక్కా కనకమహాలక్ష్మిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరుచగా 14 రోజులు రిమాండ్ విధించినట్టు తాలూకా ఎస్‌ఐ వై.శేఖర్‌బాబు బుధవారం తెలిపారు. గ్రామంలో సుమారు 90 డ్వాక్రా సంఘాల్లోని మహిళలు స్త్రీనిధి రుణాలతో పాటు ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్, బ్యాంకు లింకేజీ రుణాలను తీసుకున్నారు. వాటిని క్రమం తప్పకుండా నెలనెలా యానిమేటర్లయిన లావణ్య, కనకమహాలక్ష్మికి బ్యాంకులో జమ చేసేందుకు చెల్లించారు. అయితే చెల్లించిన సొమ్ములు బ్యాంకుకు జమ కావడం లేదని గుర్తించిన డ్వాక్రా మహిళలు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఆ శాఖ అధికారుల బృందాలు దఫదఫాలుగా విచారణ జరిపి రూ.20లక్షలు ఫైబడి నిధులు స్వాహా జరిగినట్టు గుర్తించి ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చారు. ఎప్పటికప్పుడు ఆ సొమ్ములు చెల్లిస్తామని చెబుతూనే యానిమేటర్లు కాలం వెళ్లదీశారు. చివరకు డ్వాక్రా మహిళల ఫిర్యాదు మేరకు యానిమేటర్లు లావణ్య, కనకమహాలక్ష్మిని అరెస్టు చేసి అమలాపురం ఏజేఎఫ్‌సీఎం కోర్టులో హాజరు పరిచారు. వారికి రిమాండు విధించడంతో రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించినట్టు ఎస్‌ఐ శేఖర్‌బాబు తెలిపారు.

మంచి భర్త.. నాన్నను కాలేకపోయా.. సారీ!

లెటర్ రాసి రిపోర్టర్ ఆత్మహత్య


మెట్ల కుమార్ (ఫైల్)

రాజమహేంద్రవరం సిటీ, జూలై 9(ఆంధ్రజ్యోతి): మంచి నాన్నను కాలేకపోయాను..మంచి భర్తను కాలేకపో యాను.. మంచి కొడుకును కాలేకపోయాను.. సారీ అంటూ ఒక వ్యక్తి క్షణి కావేశంలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురానికి చెందిన మెట్ల కుమార్ (45) గత దశాబ్ద కాలంగా జర్నలిజంలో ఉన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో ప్రముఖ దిన పత్రికలో గత ఎనిమిదేళ్లుగా క్రైమ్ రిపోర్టర్‌గా పనిచేస్తున్నారు. ఆయనకు భార్య గౌరి, కుమార్తె, కుమారుడు ఉన్నారు. రాజమహేంద్రవరం బొమ్మూరు నేతాజీ నగర్‌లోని ఎర్రన్నాయుడు హిందీ కళాశాల సమీపంలో అపార్టుమెంట్‌లో నివాసం ఉంటున్నారు. ఇంట్లో మనస్పర్థల కార ణంగా గత నెల 23న ఉదయం 11 గంటల సమయంలో బయటకు నడుచుకుంటూ వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా బుధవారం సాయంత్రం రైల్వే క్వార్టర్స్ రోడ్డులోని ఆలయానికి వచ్చిన వారికి దుర్వాసన రావడంతో 112కు ఫోన్ చేసి సమాచారం అందించారు. ఈ మేరకు టూటౌన్ పోలీసులు వచ్చి పరిశీలించి మృతదేహం మెట్ల కుమార్‌దిగా గుర్తించారు. మృతదేహం పూర్తిగా పాడైంది. మెట్ల కుమార్ బంధువులకు సమాచారం ఇచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దీంతో కుటుంబీకులు బోరున విలపించారు. గురువారం పోస్టుమార్టం అనంతరం మెట్ల కుమార్ మృతదేహాన్ని బంధువులకు అప్పగిస్తారు. అయితే కుమార్ బిర్యానీలో గడ్డిమందు కలిపి తిని ఆత్మహ్యాకు పాల్పడినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు.

జేబులో బుక్..

మృతదేహం సమీపంలో తన జేబులో పెట్టుకునే పాకెట్ బుక్‌ను కవర్‌లో పెట్టి దారంతో కట్టి ఉండడాన్ని గమనించి పోలీసులు ఆ బుక్‌ను ఓపెన్ చేసి చూస్తే అందులో కుమార్ తన కుటుంబీకుల కోసం రాసుకున్న ఆఖరి అక్షరాలు కనిపించాయి. మంచి భర్తను కాలేకపోయాను ఐ లవ్ యూ గౌరి అని భార్యను, మంచి నాన్న కాలేకపోయాను ఐ లవ్ యూ చిట్టితల్లి అని కుమార్తెను, బాబు జశ్వంత్ అమ్మను చెల్లిని జాగ్రత్తగా చూసుకో అని కుమారుడుని, మంచి కొడుకును కాలేకపోయానని తన తల్లిదండ్రుల ను, మంచి అల్లుడిని కాలేకపోయాను అని మావయ్యను ఉ ద్దేశించి సారీ అని రాసి ఉంది. నా వాటా ఆస్తిని నా పిల్లలకు చెందేలా చేయాలని చివరిగా రాసుకున్నాడు. బుక్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

డాక్టర్ లేరు... అంబులెన్స్ రాలేదు

వైద్యం అందక ఆరేళ్ల బాలుడి మృతి


బాలుడిని ఎత్తుకుని ఆసుపత్రి ప్రాంగణంలో కుటుంబ సభ్యులు


మరణించిన బాలుడు

ఎటపాక, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఫిట్స్ వచ్చిన ఆరేళ్ల బాలుడికి వైద్యం అందక, అటు 108 అంబులెన్స్ సమయానికి రాక మృతిచెందిన ఘటన అల్లూరి జిల్లా ఎటపాక మండలం బండిరేవు గ్రామంలో జరిగింది. బండిరేవుకు చెందిన నూపా జయదేవ్ (6) గత 3 రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. బుధవారం సాయంత్రం బాలుడికి ఫిట్స్ రావడంతో కుటుంబ సభ్యులు సమీపంలోని లక్ష్మీపురం పీహెచ్‌సీకి వైద్యం కోసం తీసుకొచ్చారు. ఆ సమయంలో వైద్యాధికారిణి అందుబాటులో లేకపోవడంతో వైద్యాధికారిణి సూచనలతో అక్కడి సిబ్బంది బాలుడికి 2 గంటల పాటు వైద్యం చేశారు. బాలుడిని కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం భద్రాచలం ఏరియా వైద్యశాలకు తరలించాలని భావించి 108 అంబులెన్స్‌ను సంప్రదించారు. అంబులెన్స్ అందుబాటులో లేకపోవడంతో చివరకు కూనవరం నుంచి 108 అంబులెన్స్ అందుబాటులోకి లభించింది. దాంతో అక్కడి నుంచి లక్ష్మీపురానికి ఆలస్యంగా రావడంతో బాలుడి ఆరోగ్య పరిస్థితి విష మించి మృతిచెందాడు. లక్ష్మీపురం పీహెచ్ సీ వైద్యాధికారిణి అందు బాటులో లేకపోవ డంతోనే తమ బాలుడి మృతి చెందాడని తల్లిదండ్రులు ఆరోపించారు. ఈ విషయమై పీహెచ్‌సీ వైద్యాధికారిణి గౌతమిని వివరణగా కోరగా బాలుడు జయదేవ్‌కు గుండె సమస్య ఉందని, ఇతరత్రా చోట్ల వైద్యం అందిస్తున్నారని, బాలుడి ఆరోగ్య పరిస్థితి విషయంగా ఉన్నప్పుడే తీసుకువచ్చారని, చికిత్స అందిస్తునే మెరుగైన వైద్యానికి తరలించే క్రమంలో మృతిచెందాడని పేర్కొన్నారు.

లారీ ఢీకొని యువకుడి మృతి



సంఘటనా స్థలంలో సుభాష్ మృతదేహం, (ఫైల్)

రావులపాలెం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై మోటార్‌సైకిల్‌పై వెళ్తున్న యువకుడిని లారీ ఢీకొనడంతో మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం గంటి చిన్నపేటకు చెందిన యడ్ల సుభాష్(24) బుధవారం రావులపాలెం వైపు నుంచి గోపాలపురం జాతీయ రహదారి సెంటర్ వైపు మోటార్‌సైకిల్‌పై వెళ్తుండగా వెనుక నుంచి వేగంగా వస్తున్న లారీ బలంగా ఢీకొంది. దీంతో లారీ చక్రాల కింద నలిగి సుభాష్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొత్తపేట ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ ఎం.శేఖర్‌బాబు తెలిపారు.

విద్యార్థి అదృశ్యంపై ఫిర్యాదు

ప్రత్తిపాడు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ధర్మవరంలోని అద్దేపల్లి అచ్యుతరామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 9వతరగతి విద్యార్థి గొంతు రెడ్డి విజయ్‌కుమార్ (14) అదృశ్యమయ్యాడు. ధర్మవరంలోని సీతంపేటకు చెందిన విజయకుమార్ ఇంటిలో గొడవపడి వెళ్లిపోయినట్టు బుధవారం కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. విద్యార్థి ఆచూకీతెలిసిన వారు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందించాలని కోరారు.

దుస్తులు ఆరవేయలేదని భర్త మందలింపు

భార్య ఆత్మహత్య

కొత్తపేట, జూలై 9 (ఆంధ్రజ్యోతి): భర్త మందలించాడనే మనస్తాపానికి గురైన భార్య ఫ్యానుకు చీరతో ఉరివేసుకుని మృతిచెందిన్నట్టు ఎస్‌ఐ జి.సురేంద్ర తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... ఏలూరు జిల్లా కామవరపుకోట మండలం తాడిచెర్ల గ్రామానికి చెందిన మనల్లే నాగరవీంద్ర గత కొంత కాలంగా కోనసీమ జిల్లా రావులపాలెం సర్వే పామాయిల్ కంపెనీలో ఫీల్డ్‌ఆఫీసర్‌గా పనిచేస్తున్నాడు. తన భార్య పావని(24), రెండేళ్ల కుమార్తెతో కలిసి కొత్తపేట బాబానగర్‌లో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. మంగళవారం రాత్రి రవీంద్ర విధులు ముగించుకుని ఇంటికి రాగ తన భార్య పావనిని ఉతికిన దుస్తులు ఆరవేయలేదని మదలించాడు. దీంతో మనస్తాపానికి గురైన పావని పక్క గదిలో సీలింగ్ ఫ్యానుకు ఉరివేసుకుంది. చూట్టుపక్కల వారి సాయంతో తలుపులు పగలుకొట్టి భార్య పావనిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా వైద్యులు పరీక్షించి మృతిచెందిన్నట్టు ధ్రువీకరించారు. పావని తండ్రి కొండేపూడి నాగేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ సురేంద్ర తెలిపారు.

ఏటీఎం కార్డు మార్చి రూ.70వేలు చోరీ

నిందితుడి అరెస్టు

యానాం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): నగదును డ్రా చేసేందుకు ఏటీఎంకు వెళ్లిన రిటైర్డు పోలీసు ఉద్యోగిని బోల్తా కొట్టించి కార్డును మార్చి వేసి నగదును డ్రా చేసుకుని పరారైన నిందితుడిని బుధవారం యానాం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్‌ఐ సుబ్బరాజు తెలిపిన వివరాల మేరకు... కాకినాడ జిల్లా పిఠాపురం వద్ద నందికిపురానికి చెందిన ప్రస్తుతం కాకినాడ రాయుడుపాలెంలో నివాసం ఉంటున్న కాసీబు రాంబాబును అదుపులోకి తీసుకున్నారు. గత నెల 28న యానాంలోని పిల్లా రాయవీధిలో గల ఎస్‌బీఐ ఏటీఎం నుంచి పోలీసు రిటైర్డ్ ఉద్యోగి పి.సత్యనారాయణ రూ.10 వేలు డ్రా చేశాడు. మినీస్టేట్మెంట్ కోసం ప్రయత్నించినా రాకపోవడంతో పక్కనే మాస్క్ పెట్టుకుని ఉన్న రాంబాబును తీయమని అడిగి కార్డుతో పాటు పిన్ నెంబరు చెప్పాడు. అయితే స్టేట్మెంట్ రావడంలేదని చెప్పి సత్యనారాయణకు తన వద్ద ఉన్న మరో ఏటీఎం కార్డును ఇచ్చాడు రాంబాబు. అది గ్రహించని సత్యనారాయణ ఇంటికి వెళ్లిపోయాడు. అనంతరం బైక్‌పై వెళ్లిన రాంబాబు సుంకరపాలెం వద్ద ఉన్న ఏటీఎంలో సత్యనారాయణ నుంచి తీసుకున్న కార్డు పెట్టి రూ.70వేలు విడతల వారిగా డ్రా చేశాడు. 30న బ్యాంక్‌కు వచ్చిన సత్యనారాయణ పాస్‌బుక్ వివరాలు నమోదు చేయించుకోగా రూ.70వేల మేరకు నగదు డ్రా అయినట్టు గమనించి పోలీసులును ఆశ్రయించాడు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు, క్రైం సిబ్బంది దుర్గారావు, గణేష్, జాంటీలతో కలిసి ఏటీఎం సీసీ ఫుటేజ్‌లను పరిశీలించి నిందితుడిని అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి ఏటీఎం కార్డు, రూ.1000 నగదు, బైక్ స్వాధీనం చేసుకుని యానాం కోర్టులో హాజరుపరిచారు. నిందితుడు రాంబాబుపై విశాఖపట్నంలోని దువ్వాడ, కాకినాడలోని సర్పవరంలో 7 కేసులు ఉన్నట్టు గుర్తించారు.

ఆర్టీసీ బస్సులు ఢీకొని ఆరుగురికి గాయాలు

ముమ్మిడివరం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులతో వెళుతున్న ఆర్టీసీ బస్సును మరో ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఢీకొనడంతో ఆరుగురు ప్రయాణికులు గాయపడ్డారు. ఈ సంఘటన బుధవారం కోనసీమ జిల్లా ముమ్మిడివరం నగర పంచాయతీ పల్లిపాలెం సమీపంలో జరిగింది. కాకినాడ నుంచి ప్రయాణికులతో వస్తున్న ఆర్టీసీ బస్సు ముమ్మిడివరం నగర పంచాయతీ పల్లిపాలెం సమీపంలో ఆవు అడ్డు రావడంతో సడెన్ బ్రేక్ వేయగా వెనుక నుంచి వస్తున్న మరో ఆర్టీసీ బస్సు ఢీకొంది. దీంతో ముందు వెళ్తున్న ఆర్టీసీ బస్సులోని ఆరుగురు ప్రయాణికులు గాయపడగా కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ముమ్మిడివరం ఎస్‌ఐ డి.జ్వాలాసాగర్ కేసు నమోదు చేశారు.

సమ్మె సక్సెస్!

నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, పలు డిమాండ్లతో కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె విజయవంతమైంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పలుచోట్ల ధర్నాలు, నిరసనలు చేపట్టారు.


వై.రామవరంలో మానవహారం నిర్వహిస్తున్న వర్కర్లు



రాజమహేంద్రవరంలో సమ్మె నిర్వహిస్తున్న నాయకులు


ప్రత్తిపాడులో ప్రదర్శన నిర్వహిస్తున్న సీపీఎం కార్యకర్తలు


ముమ్మిడివరం బైపాస్ రోడ్డులో నిరసన తెలుపుతున్న కార్మిక సంఘాలు


మండపేట: సమ్మెలో పాల్గొన్న కార్మిక సంఘాల నాయకులు


పిఠాపురంలో ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు

రాజమహేంద్రవరం
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి
ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com



సీఐటీయూ ఆధ్వర్యంలో అనపర్తిలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు

నాలుగు లేబర్‌కోడ్లు రద్దు చేయాలి

● డీసీసీబీ ఎదుట వివిధ బ్యాంకుల ఉద్యోగులు ధర్నా



రాజమహేంద్రవరంలో ధర్నా చేస్తున్న బ్యాంకు ఉద్యోగులు



రాజమహేంద్రవరంలో సమ్మెలో పాల్గొన్న ఎల్ఐసీ ఉద్యోగులు

రాజమహేంద్రవరంఅర్బన్, జూలై 9(ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కులను హరించేవిధంగా ఉన్న నాలుగు లేబర్‌కోడ్లను కేంద్రప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని జిల్లా బ్యాంకు ఉద్యోగుల కో ఆర్డినేషన్ కమిటీ ప్రధాన కార్యదర్శి ఎన్.లక్ష్మీపతిరావు డిమాండ్ చేశారు. బుధవారం కేంద్ర కార్మిక సంఘాల దేశవ్యాప్త సమ్మెలో భాగంగా బ్యాంకు ఉద్యోగుల యూనియన్లు ఏఐబీఈఏ, బీఈఎఫ్ఐ, ఏఐబీవోఏ సమ్మెకు మద్దతు తెలుపుతూ, రాజమహేంద్రవరంలోని జిల్లా కోపరేటివ్ బ్యాంకు ఎదుట వివిధ బ్యాంకుల ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. అనంతరం ర్యాలీ జరిపారు. ఈ కార్యక్రమానికి శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఉద్యోగులు రామారావు, మురళీధర్, శివరామకృష్ణ, స్వాతి, ఉమారాణి, కీర్తన, రమేష్, సోమరాజు, అప్పారావు, రవిచంద్ర, కిషోర్, రాంబాబు, వెంకటేశ్వరరావు, క్రాంతి, ప్రసాద్, సూర్య తదితరులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం కల్చరల్: బుధవారం స్థానిక మోరంపూడి జంక్షన్‌వద్ద గల ఎల్ఐసీ రాజమండ్రి డివిజన్‌లోఉన్న 20శాఖా కార్యాలయాలలో ఉన్న 3,4 తరగతి ఉద్యోగులలో 95శాతంకిపైగా ఉద్యోగులు ఒకరోజు దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో పాల్గొని విజయవంతం చేసినట్లు ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ కార్పొరేషన్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం.కోదండరామ్ తెలిపారు. బుధవారం ఉదయం ఎల్ఐసీ డివిజనల్ ఆఫీసు ఆవరణలో అఖిల భారతీయ బీమా ఉద్యోగు సంఘం ఆధ్వర్యంలో సమ్మె నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సమ్మె ప్రదర్సన కు ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.గన్నెయ్య, ఓబీసీ ఉద్యోగుల సంఘం కార్యదర్శి ఎం.రమేష్ బాబు, ఏజంట్ల అసోసియేషన్ నాయకులు విశ్వేశ్వరరావు, సత్యనారాయణ, అధికారుల సంఘం అధ్యక్షుడు వీరకిషోర్, విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రఘునాధరావులు సంఘీభావం తెలిపారు.

అనపర్తి: కార్మికుల సమస్యల పరిష్కారంలో భాగంగా బుధవారం దేశవ్యాప్త సమ్మెలో భాగంగా అనపర్తిలో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఐటీసీ కార్మికులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశకార్యకర్తల ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయం నుంచి ఐటీసీ యూనియన్ ఆఫీసు వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. దేవీచౌక్ వద్ద మానవహారం నిర్వహించారు. యూనియన్ నాయకులు కొట్టు సూర్య నారాయణ, రవ్వ శామ్యూల్‌రాజు, పి.నాగేశ్వరరావు, రాజకుమారి, చిక్కాల శ్రీనివాస్, రాజకుమారి, నీలిమ, స్వర్ణకుమారి, అన్నపూర్ణ, అంగన్‌వాడీలు, ఆశ వర్కర్లు, వీఏవోలు పాల్గొన్నారు.

కోనేరు మురళికి ప్రముఖుల పరామర్శ



కోనేరు సుష్మంత్ వెంకట్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రముఖులు

రాజమహేంద్రవరం సిటీ, జూలై 9(ఆంధ్రజ్యోతి): పుత్రవియోగంతో బాధపడుతున్న నగర ప్రముఖుడు, టీడీపీ నేత కోనేరు మురళిని పలువురు ప్రముఖులు పరామర్శించారు. బుధవారం రాజమహేంద్రవరంలోని కోనేరు మురళి నివాసానికి జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుణ్ణం చంద్రమౌళి, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజు, మాజీ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు పొలసానపల్లి హనుమంతరావు, కిర్లంపూడి టీడీపీ నాయకుడు చదరం చంటి, బీజేపీ నాయకులు నీరుకొండ వీరన్నచౌదరి, కోడూరి రంగారావు అండ్ సన్స్, కోడూరి మెటల్స్ అండ్ మినరల్స్, వాంటేజ్ బిల్డర్స్ అండ్ డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్, సౌత్ ఇండియా పోర్ట్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ వారు చేరుకుని కోనేరు సుష్మంత్ వెంకట్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కోనేరు మురళిని పరామర్శించి సంతాపం తెలిపారు.

పేదరిక నిర్మూలనే లక్ష్యంగా పీ4 నిర్వహిస్తున్నాం

● ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, జూలై 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేదరిక నిర్మూలనే లక్ష్యంగా సీఎం చంద్రబాబు పి4 కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. బుధవారం రాజమహేంద్రవరంలో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమం 2వ డివిజన్‌లో నిర్వహించారు. ఈసందర్భంగా టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నికృష్ణ, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి యర్రా వేణుగోపాలరాయుడు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశీ నవీన్‌కుమార్, పార్లమెంట్ కమిటీ ఉపాధ్యక్షుడు మజ్జి రాంబాబులతో కలిసి ఇంటింటికీ వెళ్లారు. ప్రజలతో మమేకమయ్యారు. గృహిణిలతోను, చిరువ్యాపారులతోను ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మాట్లాడారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దొండపాటి సత్యంబాబు, బుడ్డిగ రాధా, ఉప్పులూరి జానకి రామయ్య, కంటిపూడి శ్రీనివాస్, సత్యనారాయణ, ఆనంద్, నాగమణి, రాము, గణేష్ పాల్గొన్నారు.

కొమరిపాలెంలో రూ.5.47 కోట్లతో అభివృద్ధి పనులు

బిక్కవోలు, జూలై 9(ఆంధ్రజ్యోతి): కొమరిపాలెం గ్రామంలో కూటమి ప్రభుత్వ హయాంలో గడచిన యేడాది కాలంలో రూ.5.47కోట్లతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లమిల్లి మనోజ్‌రెడ్డి తెలిపారు. కొమరిపాలెం గ్రామంలో బుధవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని మనోజ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో కూటమి నేతలు కొవ్వూరి వేణుగోపాలరెడ్డి, పడాల రాము, కర్రి శేషారత్నం పాల్గొన్నారు.

హాజరు అవకతవకలపై విచారణ జరపాలి

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల హాజరులో అవకతవకలకు పాల్పడి భారీగా నిధులు స్వాహా చేసిన రాజమహేంద్రవరంలోని సాంఘిక సంక్షేమశాఖ కళాశాల బాలుర హాస్టల్ నెంబర్-1 వార్డెన్ అవినీతిపై అధికారులు సమగ్ర విచారణ జరపాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కా వెంకటరత్నరాజు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ రాజమహేంద్రవరం ఏఎస్‌డబ్ల్యూవోను విచారణాధికారిగా నియమించడాన్ని ఆహ్వానిస్తున్నామని, అయితే ఆరోపణలు ఎదుర్కొంటున్న హాస్టల్ వార్డెన్‌ను ముందుగా సస్పెండ్ చేసి విచారణ చేపట్టాలన్నారు.

ఆశ వర్కర్ల ధర్నా

సీతానగరం, జూలై 9(ఆంధ్రజ్యోతి) దేశవ్యాప్త సమ్మెలో భాగంగా స్థానిక తహసీల్దార్ ఽకార్యాలయంవద్ద బుధవారం ఆశావర్కర్లు అంగన్‌వాడీ వర్కర్లు ధర్నా చేశారు. సీతానగరం బస్టాండ్ సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. ఆశా వర్కర్ల యూనియన్ మండల అధ్యక్షురాలు ఎం.కుమారి అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు

కోరుకొండ: కార్మిక సంఘాల తలపెట్టిన సమ్మెలో భాగంగా కోరుకొండలో అంగన్‌వాడీ టీచర్లు,హెల్పర్లు కోరుకొండ ఆర్టీసీ బస్టాండ్ వద్ద మానవహారం నిర్వహించారు. కోరుకొండ ఐసీడీఎస్‌కు చెందిన హెల్పర్లు, అంగన్‌వాడీ వర్కర్లు ఆర్టీసీ బస్టాండ్ నుంచి తహసీల్దార్ కార్యాలయంవరకు ప్రదర్శన నిర్వహించారు. సెక్టార్ నాయకులు ఎ. రామలక్ష్మి, అజుబా పలువురు అంగన్‌వాడీ వర్కర్లు,హెల్పర్లు పాల్గొన్నారు.

రాజానగరం: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఫేస్ యాప్‌ను రద్దు చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం రాజానగరంలో ఆందోళన చేపట్టారు. అనంతరం డిమాండ్లతో వినతిపత్రాన్ని అధికారులకు అందజేశారు.

చట్టాలపై ప్రజలకు అవగాహన

కడియం, జూలై 9(ఆంధ్రజ్యోతి): యువత అలవాట్లకు దూరంగా ఉండాలని, జీవితంలో ఉన్నత లక్ష్యంకోసం అడుగులు వేయాలని డీఎస్పీ భవ్యకిషోర్ తెలిపారు. దుళ్ళలో బుధవారం ప్రజలకు వివిధ అంశాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటుచేశారు. సైబర్ నేరాలుపై అవగాహన కలిగి ఉండాలన్నారు. గంజాయి, మత్తు పదార్థాల జోలికి పోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చిట్టూరి అమ్మిరాజు, సీఐ ఏ వెంకటేశ్వరరావు, ఎస్సై నాగదుర్గాప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

పీఎం సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

గోకవరం, జూలై8(ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి సూర్యఘర్ యోజనపథకాన్ని వినియోగదారులు సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్‌శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్(ఆపరేషన్) కె.తిలక్‌కుమార్ అన్నారు. స్థానిక విద్యుత్‌శాఖ కార్యాలయాన్ని బుధవారం ఆయన పరిశీలించి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. విలేఖరులతో మాట్లాడుతూ పీఎం సూర్యఘర్ పథకంతో తక్కువఖర్చుతో విద్యుత్ సదుపాయం కల్గుతుందన్నారు.

పీరా రామచంద్రపురం వాసికి గౌరవ డాక్టరేట్



పీహెచ్‌డీ పట్టా అందుకుంటున్న బుజ్జిబాబు

అనపర్తి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): అనపర్తి మండలం పీరా రామచంద్రపురం గ్రామానికి చెందిన పెనుమర్తి బుజ్జిబాబు బుధవారం విజయనగరం జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం వీసీ రాజ్యలక్ష్మి నుంచి గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. పీరా రామచంద్రపురం గ్రామానికి చెందిన పెనుమర్తి బుజ్జిబాబు సూరంపాలెం ఇంజనీరింగ్ కళాశాలలో సుదీర్ఘ కాలంపాటు అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహించారు. విజయనగరం ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగంలో పెర్ఫార్మన్స్ వేల్యూయేషన్ ఆఫ్ డిజిటల్ ఐఐఆర్ ఫిల్టర్‌ఫర్‌లో పవర్ అప్లికేషన్ అంశంలో పీహెచ్‌డీ సాధించారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

సీతానగరం, జూలై 9(ఆంధ్రజ్యోతి) మండలంలో కాటవరం గ్రామానికి చెందిన పెదపూడి సుబ్రహ్మణ్యం(37) రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మంగళవారంరాత్రి మృతి చెందినట్లు హెడ్‌కానిస్టేబుల్ వాసంశెట్టి శ్రీను బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు వివాహితుడైన సుబ్రహ్మణ్యం ఆర్థిక ఇబ్బందులతో మంగళవారం గడ్డి మందు తాగాడు. మధ్యాహ్నం 12గంటలకు పశువులు కాస్తున్న వ్యక్తిచూసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో హుటాహుటిన చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాత్రి మరణించాడు. భార్య ఈశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

100 మందికి రెడ్‌క్రాస్ శాశ్వత సభ్యత్వం

● కలెక్టర్ ప్రశాంతి ప్రశంస



చెక్కును అందజేస్తున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం, జూలై9(ఆంధ్రజ్యోతి): జిల్లా పాఠశాల విద్యాధికారి కె.వాసుదేవరావు ఆధ్వర్యంలో 100 మంది రెడ్‌క్రాస్ సొసైటీలో శాశ్వత సభ్యత్వం పొందారు. దీనికి సంబంధించిన సభ్యత్వ రుసుం రూ.1.10లక్షల చెక్కును కలెక్టర్ పి.ప్రశాంతి చేతుల మీదుగా రెడ్‌క్రాస్ తూర్పువిభాగం ప్రతినిధి డా.జి.మహాలక్ష్మికి బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా వాసు దేవరావును కలెక్టర్ ప్రశంసించారు. జిల్లాలో రెడ్‌క్రాస్ కార్యక్రమాలను విస్తృతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సంస్థ కార్యకలాపాలు సామాజికసేవలో కీలకమన్నారు. వాటిని విస్తరించడానికి సభ్యత్వ నమోదు ఉపకరిస్తుందన్నారు. కొవ్వూరు, రాజమండ్రి డివిజన్ల పరిధిలో మొత్తం 500నూతన సభ్యత్వాల నమోదు లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. యూత్ రెడ్‌క్రాస్ సభ్యులుగా కళాశాల విద్యార్థులు, జూనియర్ రెడ్‌క్రాస్ సభ్యులుగా పాఠశాల విద్యార్థులు సభ్యత్వం పొందే విధంగా చైతన్యం తీసుకురావాలని ఆమె ఆదేశించారు.

పేదవాడి ఆకలి తీర్చేందుకే అన్న క్యాంటీన్లు

● అన్న క్యాంటీన్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే బత్తుల



అన్న క్యాంటీన్ నిర్మాణానికి శంకుస్థాపనలో ఎమ్మెల్యే బత్తుల

రాజానగరం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రాజానగరంలో ని అన్న క్యాంటీన్ నిర్మాణానికి ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ బుధవారం శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఒక మంచి సుపరిపాలన నడుస్తోందని, పేదవాడి ఆకలి తీర్చే అన్న క్యాంటీన్లు సైతం గత వైసీపీ పాలనలో విధ్వంసానికి గురిచేసిందన్నారు. కూట మి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి పేదవాడు ఆకలితో అలమటించకూడదనే ఉదేశంతో తిరిగి అన్న క్యాంటీన్లు పునఃప్రారంభించడం జరుగుతుందన్నారు. తొలి విడతగా రాష్ట్రవ్యాప్తంగా 104 క్యాంటీన్లు ప్రారంభించిందన్నారు. రెండో విడతగా మరో 200 అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేస్తోందన్నారు. ఆగస్టు 15వ తేదీ నాటికి రాజానగరంలో అన్న క్యాంటీన్ నిర్మాణం పూర్తవుతుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొడ్డు వెంకటరమణ చౌదరి, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నీరుకొండ వీరన్నచౌదరి, అధికారుల సమక్షంలో అన్న క్యాంటీన్ ప్రా రంభోత్సవం చేస్తారన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

కోరుకొండ, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను జనసేనపార్టీ రాష్ట్ర కమిటీ కో ఆర్డినేటర్, ఎమ్మెల్యే బత్తుల సతీమణి బత్తుల వెంకటలక్ష్మి బాధితుల ఇళ్ళకు వెళ్ళి అందజేశారు. వివిధ గ్రామాలకు చెందిన పలువురు వ్యక్తులు వివిధ అనారోగ్యాలు కారణంగా చికిత్సలు అనంతరం సీఎం ఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేస్తున్నారు. ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సిఫార్సుతో మంజూరైన చెక్కులను ఆమె బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

నేడు, రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సీతానగరం, జూలై 9(ఆంధ్రజ్యోతి) గురు,శుక్రవారాలలో మండలంలోని పలు గ్రామాలకు విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని రాజమహేంద్రవరం రూరల్ ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్.శామ్యూల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు 33/11 కెవీ ముగ్గళ్ళ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కెవీ విద్యుత్ ఫీడర్లుకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. వెదుళ్లపల్లి, రాజంపేట, మునికూడలి గ్రామాలకు ఉదయం7గంల నుంచి మధ్యాహ్నం 12 గం.లవరకు విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందన్నారు. వాటి పరిధిలోని వ్యవసాయబోర్లకు విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. శుక్రవారం మిర్తిపాడు సబ్‌స్టేషన్ మరమ్మతుల నిమిత్తం ములకల్లంక, బొబ్బిల్లంక మిర్తిపాడు, ఉండేశ్వరపురం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉదయం7గ.ంల నుంచి మధ్యాహ్నం 12 వరకు అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలని కోరారు

రాజానగరం: వార్షిక మరమ్మతుల్లో భాగంగా 33/11 కేవీ రాజానగరం విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి సరఫరా అయ్యే 11 కేవీ ఫీడర్లకు ఈనెల 11న విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జేపీబీ నటరాజన్ బుధవారం తెలిపారు. రాజానగరం, సూర్యారావుపేట, ఇండస్ట్రియల్ ఫీడర్, గైట్ కాలేజ్, నన్నయ యూనివర్శిటీ, రాజమండ్రి పేపర్‌మిల్లు, బ్రిడ్జి కౌంటీ, తూర్పుగోనగూడెం, పల్లకడియం, రామస్వామిపేట, ఐశ్వర్య రైస్‌మిల్, లెనోరా డెంటల్ కళాశాల, క్వారీ, సాక్షి, ఐఎస్‌టీఎస్ ఉమెన్స్ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంతాలకు ఉదయం నుంచి 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

దివాన్‌చెరువు: మండలంలోని 11 కేవీ జి.ఎర్రంపాలెం ఎస్ఎస్ పరిధిలో కొత్తతుంగపాడులో గురువారం ఉదయం 7గంటలనుంచి మధ్యాహ్నం రెండుగంటల వరకూ వ్యవసాయ బోర్లుకు విద్యుత్‌సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ రాజమహేంద్రవరంరూరల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఇన్‌చార్జి జేపీబీ నటరాజన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11 కెవి కొత్తతుంగపాడు మరమ్మతులు నిమిత్తం ఈ అంతరాయం కలుగుతుందని చెప్పారు.

ఐదు రోజుల పాటు బీఎల్‌వోలకు శిక్షణ

అనపర్తి జూలై 9 (ఆంధ్రజ్యోతి) : డిటైల్స్ ఆఫ్ నేషనల్ ట్రైనింగ్ ప్రోగ్రాంలో భాగంగా బీఎల్‌వోలకు ఐదు రోజుల పాటు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ అనిల్‌కుమార్ తెలిపారు.

పంచాయతీ అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్‌పై శిక్షణ

రాజానగరం, జూలై 9(ఆంధ్రజ్యోతి): ఆర్‌జీఎస్‌ఏ ప్రణాళిక 2025-26 పంచాయతీ అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్‌పై మండలస్థాయి అధికారులకు మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశపు హాల్లో బుధవారం మండలస్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

బలభద్రపురంలో గురుపౌర్ణమికి ఏర్పాట్లు

బిక్కవోలు, జూలై 9(ఆంధ్రజ్యోతి): బలభద్రపురంలోని బాబామందిరంలో గురువారం నిర్వహించే గురుపౌర్ణమి వేడుకలకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు మందిర వ్యవస్థాపక అధ్యక్షుడు సబ్బెళ్ల పురుషోత్తమరెడ్డి బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఉదయం కాకడహారతితో వేడుకలు ప్రారంభిస్తామన్నారు.





ధాన్యలక్ష్మి.. వచ్చేసింది!

అన్నదాతలకు తీపి కబురు

- ధాన్యం బకాయిలన్నీ విడుదల
- మొత్తం రూ.362 కోట్లుపైనే
- 24 గంటల్లో చెల్లించేలా నిర్ణయం
- నేడు,రేపు జమకానున్న డబ్బులు
- కోనసీమకు రూ.189 కోట్లు
- తూర్పునకు రూ. 93.74 కోట్లు
- కాకినాడకు రూ.80 కోట్లు
- బాకీల విడుదలతో హర్షం

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రైతులకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. దాదాపు రెండు నెలలుగా పేరుకుపోయిన ధాన్యం బాకీ లకు మోక్షం కల్పించింది.ఈ మేరకు 24 గంట ల్లోగా వీటిని చెల్లించాలని బుధవారం జరిగిన కేబినెట్ సమావేశంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దీంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పేరుకు పోయిన రూ.362.72 కోట్ల బాకీలు రైతుల ఖాతాల్లో జమ కానున్నాయి. ప్రస్తుతం ఖరీఫ్ పనులు ఆసన్నమైన తరుణంలో బాకీలు పంట పెట్టుబడికి ఉపయోగపడనున్నాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రూ.362.74 కోట్లు చెల్లింపు

ఉమ్మడి జిల్లాలో ధాన్యం బాకీలు పేరుకుపోవడంతో అన్నదాతలు కొన్ని రోజులుగా డబ్బులకు ఎదురుచూస్తున్నారు.మిగిలిన బాకీలు చెల్లిస్తే ఖరీఫ్ సాగుకు డబ్బులు పనికొస్తాయని ఆశించారు. ఈ బాకీలకు సంబంధించి పౌరసరఫరాల సంస్థకు కేంద్రం నుంచి నిధులు రావడం ఆలస్యమైంది. దీంతో రైతులు పలు చోట్ల ఆందోళనలు చేసిన విషయం ప్రభుత్వం దృష్టికి వెళ్లింది. అన్నదాతలు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో సీఎం చంద్ర బాబు పౌర సరఫరాల సంస్థతో ఇటీవల సమీక్షించారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.800 కోట్ల వరకు బాకీలు ఉన్నాయని అధికారులు వివరించారు. బుధవారం జరిగిన కేబినెట్ సమావేశంలో ధాన్యం బకాయిలపై చర్చ జరిగింది. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా అన్నదాతలకు తక్షణం రూ.672 కోట్లు తక్షణం చెల్లింపులు చేయాలని సీఎం ఆదేశించారు.గురు, శుక్రవారాల్లో రైతుల ఖాతాల్లో జమకానున్నాయి. తూర్పుగోదావరి జిల్లాలో రూ.93.74 కోట్లు, కాకినాడ జిల్లాలో రూ.80 కోట్లు,కోనసీమ జిల్లా లో రూ.189 కోట్ల వరకు బాకీల చెల్లింపులు జరగనున్నాయి.మొత్తం 362.74 కోట్లు చెల్లిస్తారు.తద్వారా రైతులకు ధాన్యం బాకీల బెంగ తీరనుంది. రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

ఇప్పటికే రూ.1327 కోట్లు చెల్లింపు

ఈ ఏడాది రబీ సీజన్‌లో ఏప్రిల్ నుంచి మే నెలాఖరు వరకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసింది. ఎక్కడికక్కడ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి అన్నదాతల నుంచి ధాన్యం సేకరించింది. ఈ మేరకు అన్నదాతలకు ఇప్పటి వరకు రూ.1,327 కోట్లు చెల్లింపులు చేసింది. గత వైసీపీ ప్రభుత్వంలో అన్నదాతలు నరకం చూసేవారు.కానీ ప్రభుత్వం మారాక రబీ సీజ న్‌లో రైతులు పండించిన ధాన్యం దాదాపు కొనుగోలు చేయడానికి నిర్ణయించింది. తేమ శాతం దగ్గర నుంచి కొనుగోలు వరకు ఎక్కడా రైతులకు ఇబ్బందులు లేకుండా వ్యవహరించింది. మే నెల వరకు సుమారుగా 7.05 లక్షల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం కొనుగోలు చేసింది. కాకినాడ జిల్లాలో 15,667 మంది అన్నదాతల నుంచి 1.42 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఇందుకు రూ.322 కోట్ల వరకు బిల్లులు చెల్లించాల్సి ఉంది. వీటిలో ఇప్పటికే 1,167 మంది రైతులకు రూ.242 కోట్లు జమ చేసే సింది. తూర్పుగోదావరి జిల్లాలో 30,481 మంది అన్నదాతల నుంచి 3.53 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం సేకరించింది. దీని విలువ రూ.814 కోట్లు.ఇప్పటి వరకు రైతులకు రూ.721 కోట్లు చెల్లించేసింది.ఇంకా రూ.93.94 కోట్లు మాత్రమే చెల్లించాల్సి ఉంది. కోనసీమ జిల్లా 22 మండలాల్లో 340 కొనుగోలు కేంద్రాల ద్వారా 33,507 మంది రైతుల ద్వారా రూ.603 కోట్ల విలువైన ధాన్యాన్ని కొనుగోలు చేసింది. రూ.364 కోట్ల వరకు చెల్లింపులు చేసింది.



24 గంటల్లో సొమ్ము జమ
మంత్రి కందుల దుర్గేష్

నిడదవోలు, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా 30,988 మంది రైతుల ఖాతాల్లోకి 24 గంటల్లో ధాన్యం సొమ్ము జమ అవుతుందని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన వివరాలు వెల్లడించారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో బుధవారం జరిగిన కేబినెట్ సమావేశంలో కూటమి ప్రభుత్వం రైతాంగానికి తీపి కబురు అందించిందన్నారు. పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ కేంద్ర ప్రభుత్వంతో చర్చించారన్నారు.ధాన్యం పాత బకాయిలు వెయ్యి కోట్లకు రూ.672 కోట్ల విడుదలకు కేంద్రం అంగీకరించిందని తెలిపారు.

కదంతొక్కిన కార్మికులు



రాజమహేంద్రవరం, కొవ్వూరులో కార్మికుల నిరసన ప్రదర్శన

కార్మికలోకం కదిలింది.. సమస్యలపై నినదించింది.. సార్వత్రిక సమ్మెను పురస్కరించుకుని రాజమహేంద్రవరంలో బుధవారం ఎర్రజెండాలతో రోడ్డెక్కి తమ డిమాండ్ల సాధనకు గొంతెత్తారు.. అన్ని కార్మిక సంఘాలు ఉద్యమించాయి.. ఉదయం నుంచి సాయంత్రం వరకు జిల్లాలో బంద్ ప్రశాంతంగా ముగిసింది. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. - వివరాలు 8లో

నేడే బడి పండుగ

- 1664 పాఠశాలలు, కళాశాలల్లో నిర్వహణ
- 5 లక్షల మంది హాజరవుతారని అంచనా



రాజమండ్రి ఎస్‌కేవీటీ కళాశాలలో ఏర్పాట్లు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

బడి పండుగకు పాఠశాలలు సిద్ధమయ్యాయి.. పచ్చని తోరణాలతో అలకరించుకున్నాయి.ప్రభుత్వం గతేడాది మాదిరిగానే నిర్వహిస్తున్న 'మెగా పేరెంట్ టీచర్ మీటింగ్'కి బడులు, జూనియర్ కళాశాలల్లో ఏర్పాట్లు పూర్తయ్యాయి. దాదాపు 5 లక్షల మంది హాజరయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో అటు ఉపాధ్యాయులకు బోధనకు సమయం లేకపోగా.. ఇటు విద్యార్థుల చదువు అటకెక్కింది. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత రేపటి పౌరుల బంగారు భవిత కోసం విద్యారంగాన్ని గాడిలో పెట్టే పని మొదలుపెట్టింది. ప్రతి పాఠశాలలోని, ప్రతి విద్యార్థిపై దృష్టి సారించారు. గతేడాది ప్రభుత్వ పాఠశా లల్లో మాత్రమే నిర్వహించిన ఈ వేడుకలను.. ఈసారి ప్రైవేటు పాఠశా లలు, ఇంటర్మీడియట్ కళాశాలలకు విస్తరించారు. దీనిలో విద్యార్థి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు/సంరక్షకులు కూర్చుని విద్యార్థి భవిష్యత్తు,బడి అభివృద్ధే లక్ష్యంగా స్నేహ పూర్వకంగా చర్చిస్తారు. ముఖ్యంగా పాఠశాలలకు పాలకులు ఇస్తున్న నిధులు,చేస్తున్న అభివృద్ధి, చదువుకోవడానికి కల్పిస్తున్న వాతావరణం ఇవన్నీ పారదర్శకంగా ఉంచ డానికి వీలు కలుగుతుంది. జిల్లాలో 976 ప్రభుత్వ, 568 ప్రైవేటు, 120 ఇంటర్మీడియట్ కళాశాలల్లోని విద్యార్థులు,తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు..ఆ ప్రాంతంలోని ప్రజాప్రతినిధులు వేడుకలకు హాజరుకానున్నారు.ఈ మేరకు ఇప్పటికే ప్రభుత్వం నిధులు విడు దల చేసింది.పిల్లల బంగారు భవితకు ఒక్క అడుగు ముందుకు అనే నినాదంతో భారీ కార్యక్రమానికి పాఠశాలలను సిద్ధం చేశారు.ఇప్పటికే ఆయా పాఠశాలలు,కళాశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థుల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులు/సంరక్షకులు పండుగకు రావాలంటూ ఆహ్వాన పత్రికలు అందజేశారు.కార్యక్రమ నిర్వహణపై ఇప్పటికే కలెక్టర్ పి.ప్రశాంతి సమీక్ష చేసి స్పష్టమైన ఆదేశాలిచ్చారు.

అందరూ హాజరుకావాలి..



ఇదొక అద్భుతమైన కార్యక్రమం. అన్ని ఏర్పాట్లూ చేశాం. పిల్లల బంగారు భవితకు, విద్యాలయ అభివృద్ధికి స్నేహపూర్వక వాతావ రణంలో చర్చ జరుగుతుంది. తల్లిదండ్రులకు భోజన ఏర్పాట్లు చేశాం. ప్రతి విద్యార్థి ప్రస్తుత స్థితిని తల్లిదండ్రులకు వివరించడమే కాకుండా వారి సలహాలు, సూచనలు స్వీకరిస్తాం. ఇప్పటికే ఆహ్వాన పత్రికలు అందజేశాం. అందరూ హాజరు కావాలి.

- కె.వాసుదేవరావు,డీఈవో, తూర్పుగోదావరి

కురుకూరు వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్‌గా భాస్కరరావు

దేవరపల్లి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కురుకూరు వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్‌గా యలమాటి భాస్కరరావును ప్రభుత్వం నియమించింది. అలాగే సభ్యులుగా బొల్లం నాగేశ్వరరావు, నూకలపాటి గాంధీ నియమితులయ్యారు. ఈ మేరకు వీరిని పలువురు అభినందించారు.

దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె ప్రశాంతం



కొవ్వూరు పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు, తదితరులు

కొవ్వూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మోదీ ప్రభుత్వం పెట్టుబడిదారులకు కొమ్ము కాస్తూ కార్మిక వర్గానికి తీవ్ర అన్యాయం చేస్తోందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం. సుందరబాబు ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ అఖిల భారత కార్మికసంఘాల పిలుపు మేరకు సీఐటీయూ పట్టణ కార్యదర్శి బీర రవి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహిచిన సమ్మె ప్రశాంతంగా ముగిసింది. ఈ సందర్భంగా కొవ్వూరు బస్టాండ్ సెంటర్ నుంచి విజయవిహార్ మీదుగా ఆర్డీవో కార్యాలయం వరకు నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం విజయవిహార్ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి కార్మికవర్గాన్ని కట్టు బానిసలుగా మార్చే నాలుగు లేబర్‌కోడ్‌లను తక్షణం రద్దు చేయాలని నినాదాలు చేశారు. అనంతరం ఆర్డీవో రాణీసుస్మితకు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. సీఐటీయూ నేత సుందరబాబు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మద్దుకూరి దొరయ్య మాట్లాడారు. పి.గురునాథ్, ఆర్.అప్పారావు, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు సిహెచ్. మాణిక్యాంబ, వి.శ్రీదేవి, సిహెచ్. బ్రహ్మమ్మ, నిర్మాణ కార్మికులు మాణికిరెడ్డి హరిబాబు, వర్రే సోమేశ్వరరావు, రేఖ నాగేశ్వరరావు, జొన్నల రాంబాబు, వీరా త్రిమూర్తులు, సిద్ధిరెడ్డి బాపిరాజు, మనకపల్లి శ్రీను, కొమ్మన రాముడు, జి.శ్రీను, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు. అలాగే ఇంటిపని చేసే మహిళా కార్మికులకు ప్రత్యేక సంక్షేమ చట్టం తీసుకురావాలని ప్రగతిశీల మహిళా సంఘం (పీఓడబ్ల్యు) జిల్లా సహాయ కార్యదర్శి ఈమని మల్లిక డిమాండ్ చేశారు. ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో బుధవారం కార్మికుల దేశవ్యాప్త చేపట్టారు. కార్యక్రమంలో ఇంటిపనివారల సంఘం నాయకులు భవాని, రీనా, నవీన ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ నాయకులు హరీష్, పీఓడబ్ల్యూ నాయకులు జయ, ఐఎఫ్‌టీయునాయకులు శ్రీను, తదితరులు పాల్గొన్నారు. ఈ సమ్మెకు పౌరహక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నంబూరి శ్రీమన్నారాయణ మద్దతు తెలియజేశారు.

తాళ్లపూడి: దేశ వ్యాప్తంగా చేపట్టిన సమ్మెలో మండలంలోని సీఐటీయూ అనుబంధ సంస్థలైన పలు కార్మిక సంఘాలు సభ్యులు పాల్గొని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా నేత వల్లిపల్లి నరసింహరావు మాట్లాడుతూ కార్మికులకు వ్యతిరేకమైన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తాపీ పని సంఘ నాయకులు ఉప్పే కేదారేశ్వరరావు, జట్టు కార్మిక సంఘ నాయకులు సూర్యనారాయణ, అన్నదేవరపేట సంఘ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, ఆశవర్కర్ల నాయకులు సుధారాణి, బేబీ కుమారి, అంగన్‌వాడీ వర్కర్ల నాయకులు సుజాత, వివిధ శాఖల వర్కర్లు, మిడ్‌డేమీల్స్ వర్కర్లు, రైతుకూలీ సంఘం సభ్యులు, ఐకేపీ సిబ్బంది, జట్లు కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

చాగల్లు: కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో చాగల్లులో బుధవారం సమ్మె నిర్వహించారు. కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా స్థానిక ఐఎంఎల్ డిపో నుంచి మెయిన్‌రోడ్డు సెంటర్ మీదుగా తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేస్తూ పలు నినాదాలు చేశారు. దీనిలో భాగంగా సీఐటీయూ నాయకుడు కేకే దుర్గారావు మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐఎంఎల్ డిపో హమాలీలు, భవన నిర్మాణ కారికులు, ఆశ, అంగన్‌వాడీ వర్కర్లు, యూటీఎఫ్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నల్లజర్ల: నాలుగు లేబర్ కోడ్లును తక్షణమే రద్దు చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి బొంగు వీరభద్రం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీలు కలిసి తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేసి, వినతిపత్రం అందించారు. అనంతరం నల్లజర్ల సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. జయమ్మ, విమలబాయి, శివకుమారి, రామలక్ష్మి, వై. బేబి,చిట్టిబాబు, మన్యం భాస్కరరావు,పి. వెంకట్రావు పాల్గొన్నారు.

నిడదవోలు: కేంద్రంలో మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు రేఖా భాస్కరరావు డిమాండ్ చేశారు. బుధవారం నిడదవోలు పట్టణంలో ఏఐటీయూసీ, సీపీఎం ఆధ్వర్యంలో దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను నిర్వహించారు. కార్యక్రమంలో గన్నాబత్తుల సత్యనారాయణ, మొయిలి శ్రీను, రామిశెట్టి సత్తిబాబు, బేజా అప్పారావు, కోసూరి శ్రీను, మామిడి సన్యాసిరావు, రొంగల శ్రీను, బొచ్చా ముద్దు కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

గోపాలపురం: సీఐటీయూ కేంద్ర కమిటీ పిలుపు మేరకు మండలంలో కార్మిక సంఘాలు చేపట్టిన సమ్మె బుధవారం ప్రశాంతంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయా ప్రభుత్వ అనుబంధరంగాల్లో పనిచేస్తున్న కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం చెక్‌పోస్టు సెంటర్‌కు చేరుకుని నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ, ఆశ, డ్వాక్రా సంఘాల సీఏలు, వీఆర్ఏలు, భారీగా పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: దేశ వ్యాప్త కార్మికుల సమ్మెలో మండలంలోని వివిధ సంఘాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జయకర్ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. జిల్లా కోఆపరేటివ్ ఎంప్లాయిస్ యూనియన్ జనరల్ సెక్రటరీ సీహెచ్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కార్మికులంతా ఐక్యతతో ఉండి హక్కులను సాధించుకోవాలన్నారు. వివిధ కార్మిక సంఘాలనాయకులు వి. సుబ్బారావు, జి. అప్పలాచార్యులు, పినిశెట్టి ప్రసాద్, అమ్మిన ప్రకాశ్,షేక్ వలీ, చప్పిడి హనుమంతరావు, ఐశెట్టి విజయరాజు, మాచినేని మధు, మారిశెట్టినాగేశ్వరరావు, పులుపు సుబ్రహ్మణ్యం, తాళ్లూరి కేదారి, నిమ్మన శ్రీనివాస్, శీలం శ్రీను, కార్మికులు పాల్గొన్నారు.



తాళ్లపూడిలో...



చాగల్లులో ర్యాలీ చేస్తున్న కార్మిక సంఘాలు



నిడదవోలులో ..



గోపాలపురంలో ...

కార్యదర్శులకు ఒక్క రోజు శిక్షణ

గోపాలపురం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కార్యదర్శులు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండి పౌరసేవలను అందించాలని ఎంపీడీవో జీ.రాజ్ మనోహర్ తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం సమావేశపు మందిరంలో పంచాయతీ పురోగతి సూచికపై ఒక్క రోజు శిక్షణ నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు అందించాలన్నారు.

పెరవలిలో..

పెరవలి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పంచాయతీ అడ్వాన్సుమెంట్ ఇండెక్స్ కార్యక్రమంలో భాగంగా అధికారులకు ఒక్కరోజు శిక్షణ నిర్వహించారు.

సాయిబాబాకు విశేష పూజలు, అభిషేకాలు


తాడిమళ్లలో విశేష పూజలందుకున్న సాయిబాబా

నిడదవోలు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): తాడిమళ్లలో వేంచేసివున్న నాగసాయి మందిరంలో సాయిబాబాకు బుధవారం విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయం నుంచి అఖండసాయి నామ సంకీర్తన వళి అనంతరం హరికథ కార్యక్రమాన్ని నిర్వహించారు. గురువారం గురుపౌర్ణమి సందర్భంగా సాయిబాబాకు పంచామృత మహాన్యాస పూర్వక విశేష అభిషేకాలు, భారీ అన్నసమారాధన ఉంటుందని ట్రస్ట్ సభ్యులు తాతిరాజు సుబ్రహ్మణ్యం, టీవీ మధు, కాగిత రామారావు, టి.రామశేషు, టి.శ్రీను, ప్రధాన అర్చకులు కూచి సుబ్రహ్మణ్యం తెలిపారు.

పారదర్శకంగా భూముల రీ సర్వే : ఆర్డీవో

దేవరపల్లి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రీ సర్వే ద్వారా భూ సమస్యలు పరిష్కరించటం జరిగిందని కొవ్వూరు ఆర్‌డీఓ రాణీసుస్మిత పేర్కొన్నారు. కురుకూరులో రీసర్వేపై బుధవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ గ్రామంలో గతంలో ఈ రీసర్వేలో భూమి కొలతల్లో వ్యత్యాసాలు అధికంగా ఉండటం వల్ల రైతులు ఇబ్బందులుపడ్డారని, అందువల్ల ప్రస్తుతం రీ సర్వే చేయడం ద్వారా 99 శాతం సమస్య పరిష్కారం అయ్యిందని తెలిపారు. సమస్యను రైతులు అధికారుల దృష్టికి తేవడంతో మూడు టీమ్‌లు రీ సర్వేలో పాల్గొన్నాయన్నారు. కురుకూరు రైతులకు 880 ఖాతాలున్నాయని, 2535 ఎకరాలు సర్వే చేయడం జరిగిందన్నారు. రైతులకు ఇంకా ఏమైనా సమస్యలుంటే 11 రోజుల్లో పరిష్కరించటం జరుగుతుందన్నారు. అనంతరం ఐఎస్‌వో వెంకటేశ్వరరావు మాట్లాడారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎం.శ్రీనివాస్, మండల సర్వేయర్ డిల్లేశ్వరరావు, సర్వేయర్ శివభాస్కరరావు, కార్యదర్శి సంధ్యారాణి, రైతులు యలమాటి భాస్కరరావు, కొయ్యలమూడి అచ్యుతరావు, మల్లెల వెంకటేశ్వరరావు, కొయ్యలమూడి ఝూన్సీ, వీఆర్వోలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

దేవరపల్లి, జూలై9 (ఆంధ్రజ్యోతి): నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేసి, కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని మండల సీఐటీయూ కార్యదర్శి ఎస్.భగత్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం సార్వత్రిక సమ్మెలో భాగంగా వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ, మానవహారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల అధ్యక్షుడు ఎస్.భగత్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ టీపీ లక్ష్మి మాట్లాడారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల గౌరవ అధ్యక్షుడు మల్లిపూడి వెంకటలక్ష్మి, వివిధ కార్మికసంఘం నాయకులు పెంటయ్య, స్వరూప, కొర్లపాటి ఇందిరా, గుంటూరు వరలక్ష్మి, ఉండవల్లి కృష్ణారావు, రత్నాజీ, తదితరులు పాల్గొన్నారు.

పాన్‌షాపు తాళాలు పగుల గొట్టి చోరీ

కొవ్వూరు, జూలై 9(ఆంధ్రజ్యోతి): పాన్ షాపు తాళాలు బద్దలు కొట్టి రూ. 15 వేలు విలువైన వస్తువులు అపహరించుకోవడంపై కేసునమోదు చేసినట్టు కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం పట్టణంలోని ఎల్‌ఐసీ ఎదుట ఉన్న పాన్‌షాపు నిర్వాహకుడు కొండ్రంకి కురిమిశెట్టి ప్రతిరోజు మాదిరిగా ఈ నెల 8వ తేదీ రాత్రి షాపుకు తాళం పెట్టి ఇంటికి వెళ్లిపోయాడు. తిరిగి ఉదయం వచ్చే సరికి షాపు తాళాలు పగులగొట్టి ఉన్నాయి. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. షాపులో రూ. 15 వేల విలువైన వస్తువులు దొంగిలించుకుపోయినట్టు ఫిర్యాదులో పేర్కొన్నాడు. కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

గణపతి ఆలయంలో హుండీ దొంగతనంపై కేసు

కొవ్వూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గణపతి ఆలయంలో హుండీ దొంగతనంపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం బుధవారం తెలిపారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం పట్టణంలోని సత్యవతినగర్‌లోని రక్షక గణపతి ఆలయంలో రాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి హుండీని బద్దలు కొట్టి సుమారు రూ. 40 వేల నగదు దొంగిలించుకుపోయారని నిర్వాహకురాలు దొడ్డా సత్యవాణి తెలిపారు. ఈ మేరకు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు సీఐ విశ్వం తెలిపారు. సీఐ మాట్లాడుతూ నిందితులను త్వరలోనే పట్టుకుంటామని చెప్పారు.

నేడే పేరెంట్స్ కమిటీ సమావేశం

తాళ్లపూడి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతి పాఠశాలలో గురువారం పేరెంట్స్ కమిటీ సమావేశాన్ని విధిగా నిర్వహించాలని ఎంఈవో బాలామణి తెలిపారు. దీనికి తహశీల్దార్ లక్ష్మీలావణ్య పరిశీలకురాలిగా వ్యవహరించనున్నారు. ఈ మేరకు బుధవారం ఎంఈవో కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. ఎంఈవో-2 నెహ్రూజీ, తదితరులు పాల్గొన్నారు.

'పొలం పిలుస్తోంది'

తాళ్లపూడి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మలకపల్లిలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహిం చారు. దీనికి వ్యవశాయశాఖ ఏడీ సీహెచ్ శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకానికి అర్హత కలిగి వివిధ కారణాల వల్ల ఇంకా పోర్టల్ నందు నమోదు కాని రైతులు ఈనెల 13 లోపు రైతు సేవా కేంద్రాలు లేదా గ్రీవెన్స్ ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు. మండల వ్యవసాయాధికారిణి రుచిత, గ్రామ వ్యవసాయ సహాయకులు, బీమా కంపెనీ ప్రతిధులు, రైతులు పాల్గొన్నారు. కార్యక్రమంలో మండలంలోని పురుగుమందుల షాపుల యజమానులు, తదితరులు పాల్గొన్నారు.

200 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు

చాగల్లు, జులై 9 (ఆంధ్రజ్యోతి): చాగల్లు శ్రీరాజరాజేశ్వరి విద్యాలయలో నిడదవోలు రాజేశ్వరి రామకృష్ణన్ లయన్స్ కంటి ఆసుపత్రి వారి సౌజన్యంతో లయన్స్ క్లబ్ సహకారంతో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఇందులో పాఠశాల విద్యార్థులు 200 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో తొమ్మిది మందికి కళ్లద్దాలు అవసరమని గుర్తించారు. కార్యక్రమంలో లయన్స్ సభ్యులు వల్లిపల్లి వెంకటరామారావు, పిచికల సత్యనారాయణ, కోడి నాగేశ్వరరావు, ఆళ్ల సత్తిబాబు, కంటిపూడి అచ్యుతరామ ప్రసాద్ పాల్గొన్నారు.

వార్షిక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి

ఉండ్రాజవరం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో వార్షిక కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంపీడీవో వీఎస్ రామారావు పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం వార్షిక కార్యచరణ ప్రణాళికపై ఇచ్చిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి శాఖ నుంచి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని మండలస్థాయి అధికారులకు సూచించారు. తహశీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన పీ4 విధానం పేదలకు వరమని చెప్పారు. దీని అమలుకు గ్రామాల్లో ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన సూచించారు. డిప్యూటీ ఎంపీడీవో కేఎస్ఆర్ శర్మ, వివిధశాఖల అధికారులు, ఏఎన్ఎంలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జగన్ రాష్ట్రాన్ని అప్పుల పాల్జేశాడు : ఎమ్మెల్యే


11వ వార్డులో ప్రజలకు పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి, తదితరులు

కొవ్వూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని జగన్మోహనరెడ్డి అప్పులపాల్జేసి ఆర్థిక ఇబ్బందుల్లోకి నెట్టేశాడని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు పట్టణంలోని 11వ వార్డు, సాయంత్రం వేములూరులో బుధవారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందరంగా టీడీపీ నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కారక్రమాల గురించి వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సూరపనేని చిన్ని, నాయుడు వెంకటేశ్వరరావు, పెనుమాక జయరాజు, కొప్పాక జవహర్, కళ్యాణి వీర్రాజు, అల్లం మురళి, సంఘంరెడ్డి చిన్నదుర్గాప్రసాద్, కళ్యాణి గంగాధర్, కౌన్సిలర్లు బొండాడ సత్యనారాయణ, మరపట్ల కళాధర్, కేవీకే రంగారావు, పెరవలి రంగాప్రసాద్, గ్రామస్థులు పాల్గొన్నారు.

నల్లజర్ల: ప్రజల మన్ననలతోనే కూటమి ప్రభుత్వం నడుస్తుందని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట రాజు అన్నారు.సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని బుధవారం అయ్యవరం, దూబచర్ల, ఘంటావారిగూడెం, పుల్లలపాడు, ముసుళ్ళకుంట గ్రామాల్లో నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు తాతిన సత్యనారాయణ, టీడీపీ జిల్లా నేత కూచిపూడి ఉదయభాస్కరరావు, చుక్కా శ్రీను, జనసేన నాయకులు శివరామకృష్ణ, దూబచర్ల పార్టీ అధ్యక్షుడు కాకర్ల రామకృష్ణ, సర్పంచ్ తానిగడప బాలయ్య, ఎంపీటీసీ ఈడే శ్రీను,పుల్లలపాడు నాయకులు దామోదరం, పావులూరి శ్రీను, ముసుళ్ళకుంట సర్పంచ్ నందమూరి శారదదేవి, రామకృష్ణ, బలుసు గంగరాజు, తదితరులు పాల్గొన్నారు.

చాగల్లు: ప్రజా సంక్షేమానికి కూటమి ప్రభుత్వం నిరంతం కృషిచేస్తోందని ఏఎంసీ చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్ చౌదరి అన్నారు. బుధవారం చాగల్లు డైలీ మార్కెట్ సెంటర్‌లో సుపరిపాల నలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ ఆళ్ల హరిబాబు, టీడీపీ నాయకులు కరుటూరి సతీష్, కేతాసాహెబ్, దొంగ రామకృష్ణ, జే వెంకాయమ్మ, ఆళ్లసూర్యప్రకాశరావు, తదితరులు పాల్గొన్నారు.


చాగల్లు డైలీ మార్కెట్ సెంటర్‌లో కరపత్రాలు పంచుతున్న టీడీపీ నాయకులు

దేవరపల్లి: కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో సుపరిపాలనను అందించిందని టీడీపీ రాష్ట్ర మహిళా అధికార ప్రతినిధి కొయ్యలమూడి సుధారాణి, మాజీ మండల టీడీపీ అధ్యక్షుడు కొయ్యలమూడి చినబాబు పేర్కొన్నారు. పల్లంట్లలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ టీడీపీ అధ్యక్షుడు ఆచంట శ్రీరామ్‌ప్రసాద్, నాయకులు తాలూరి శ్రీనివాస్, ఆలపాటి రాజేశ్, చింతాల దాసు, అక్కాబత్తుల వెంకట్రమణ, సత్యనారాయణ, మర్రి కిషోర్, బొల్లం శ్రీను, నూకలపాటి గాంధీ, తదితరులు పాల్గొన్నారు.

ఈఎస్‌ఐ ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీ చేసిన ఎమ్మెల్యే

కొవ్వూరు, జూలై 9(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు ఈఎస్‌ఐ ఆసుపత్రిని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఆసుపత్రిలో డాక్టర్ల నుంచి వైద్యసేవలు, మందుల సరఫరా, సిబ్బంది గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందరంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆసుపత్రిలో సిబ్బంది కొరత, మౌలిక సదుపాయాల కల్పన విషయాలను మంత్రి దృషికి తీసుకువెళ్తానన్నారు. అనంతరం పలు విషయాలపై మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని, నాయకులు పాల్గొన్నారు.

లీలాకృష్ణను కలిసిన నేతలు

తాళ్లపూడి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్‌ఐడీసీ చైర్మన్‌గా నియమితులైన వేగుళ్ల లీలాకృష్ణను పైడిమెట్ట ఎత్తిపోతల పథకం అధ్యక్షుడు ముళ్లపూడి శ్రీరామచంద్రమూర్తి, తదితరులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించినట్లు కార్యదర్శి గన్నిన సత్తిబాబు తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని ఎత్తిపోతల పథకాల గురించి వివరించినట్లు తెలిపారు. ఆయనతోపాటు పలువురు స్కీమ్ సభ్యులు ఉన్నారు.

రుడా పరిధిలో జీఐఎస్ ఆధారిత
మాస్టర్ ప్లాన్ సిద్ధం

రాజమహేంద్రవరం సిటీ, జూలై 9(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం రుడా పరిధిలో జీఐఎస్ ఆధారిత మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయాలని నిర్ణయించడం జరిగిందని రుడా వీసీ చిన్నరాముడు తెలిపారు. ఈమేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రాథమిక ముసాయిదా మస్టాన్ ప్లాన్ ఎం/ఎస్ స్కైగ్రూప్ అండ్ నికేతన్ కన్సల్టెంట్స్ వారు రూపొందించినట్టు తెలిపారు. మాస్టర్ ప్లాన్ ప్రణాళికపై రెవెన్యూ ,పురపాలక ,పట్టణ ప్రణాళిక ,రవాణా, పిడబ్ల్యుడీ ,పర్యావరణ శాఖలతో పాటు ప్రజా ప్రతినిధులు ,ప్రజలు తమ అభిప్రాయాలు ,సూచనలు ఇవ్వవచ్చని తెలిపారు. ప్రజల సౌకర్యార్థం మస్టార్ ప్లాన్ ముసాయిదాను రుడా కార్యాలయం, జిల్లా కలెక్టరేట్, రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయం, యూఎల్‌బీ కార్యాలయంలో ఉంచారని, అదేవిధంగా రుడా.ఏపి.జీవోవి.ఇన్ వెబ్‌సైట్‌లోనూ అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. అభిప్రాయాలను, సుచనలను 30 రోజుల వ్యవధిలో స్వీకరించనున్నట్టు తెలిపారు.

● నిడదవోలు మాస్టర్ పై
30 రోజుల్లోగా అభ్యంతరాలు తెలపాలి

నిడదవోలు మునిసిపాలిటి ప్రతిపాధిత ముసాయిదా మాస్టర్ ప్లాన్‌ను రూపొంచారని రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, వీసీ ఎస్ న్నరాముడులు ప్రజల సౌకర్యార్థం మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు రూపొందించిన నిడదవోలు మాస్టర్ ప్లాన్‌పై ఎటువంటి అభ్యంతరాలు ఉన్నా... 30 రోజుల్లో తెలపాలని వీసీ కోరారు.

ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షుడిగా శ్రీనివాసరావు

కొవ్వూరు, జూలై 9(ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షుడిగా నాళం శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం కొవ్వూరు ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. నూతన అధ్యక్షులుగా నాళం శ్రీనివాసరావు, కార్యదర్శిగా కాకి అనీల్ సూర్య, కోశాధికారి కంకటాల రాంబాబు, వాసవీ ట్రస్ట్ చైర్మన్‌గా పెరుమాళ్ళ వీరేశ్వరరావును ఏకగ్రీవంగా ఎనుకున్నారు. నూతన కార్యవర్గానికి మట్టే ప్రసాద్, సత్యవరపు గోపాలకృష్ణ, మద్దుల సత్యనారాయణ, మద్దుల నాని, కొల్లేపర శ్రీనివాస్, ఎంబీఎస్ ప్రసాద్ అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా పూడ్చిపెట్టిన మృతదేహాలను తొలగించాలి

కొవ్వూరు, జూలై 9(ఆంధ్రజ్యోతి): పశివేదలలోని ప్రభుత్వ భూమిలో జనావాసాల మధ్య అక్రమంగా పూడ్చిపెట్టిన మృతదేహాలను అక్కడ నుంచి తొలగించాలని అరుంధతీయులు డిమాండ్ చేశారు. బుధవారం ఆ గ్రామ సచివాలయంలో అధికారులను కలిసి కోరారు. దీనిపై ఆర్డీవో, తహశీల్దార్‌కు వినతిపత్రాలు అందజేశామన్నారు. కార్యక్రమంలో అరుంధతీయ నాయకులు కండెల్లి భీష్మ గాంగేయుడు, కొడమంచిలి మంగసత్యం, మల్లిపూడి వినయ్‌చంద్ర, బొల్లిపో శ్రీనివాస్, తానేటి శాంతకుమారి, మల్లిపూడి సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

రెండు ఇసుక లారీలు సీజ్

తాళ్లపూడి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రక్కిలంక ఇసుక రీచ్ నుంచి ఎటువంటి బిల్లులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు లారీలను గజ్జరం జంక్షన్‌లో టాస్క్ ఫోర్స్ ఏఎస్‌ఐ జీ. గంగాధరరావు పట్టుకున్నారు. అనంతరం వాటిని తాళ్లపూడి పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు.